
# సత్యమేవ జయతే

## కూచిపూడిని విశ్వవ్యాప్తం చేసిన వెంపటి చినసత్యం



- సినీ నృత్య దర్శకుడిగా అంతులేని పేరు ప్రఖ్యాతులు
- టీటీడీ ఆస్థాన నాట్యాచార్యుడిగా అరుదైన గౌరవం
- పద్మభూషణ్ వంటి ఎన్నో అవార్డులు సొంతం
- మహామహులకు నాట్యంలో మెలకువలు నేర్పిన గురువు
- ప్రపంచవ్యాప్తంగా 10 వేలకు పైగా శిష్యులు
- ఏటా రాష్ట్ర ప్రభుత్వ యక్షగాన సార్వభౌమ స్మారక పురస్కారం



నేడు జయంతి

నిజమైన కళ అంటే.. కనులకు, చెవులకు ఆనందాన్ని ఇచ్చేది కాదు. మనసును ఆహ్లాదపరిచేది. అలాంటి కళతో జనులను రంజింపజేసినవాడు చరితార్థుడవుతాడు. పద్మభూషణ్ వెంపటి చినసత్యం ఈ కోవకు చెందిన వారే. భరతనాట్యమే ప్రధానంగా సాగుతున్న భారతీయ నాట్యరంగంలో కూచిపూడి నాట్యానికి అగ్రస్థానం కల్పించిన మహనీయుడాయన. ఆయన స్పృశించిన ప్రతి రూపకం నాటరాజ పాదపద్మాంకితమే. ఆయన తీర్చిదిద్దిన ప్రతి శిష్యుడు ప్రపంచపటంలో ఓ నాట్య శిఖరమే. 'క్షీరసాగర మదనం' మొదలు 'చండాలిక' వంటి ఎన్నో నృత్య రూపకాలు తెలుగువాడి కీర్తి పతాకాన్ని విశ్వవీధుల్లో రెపరెపలాడించాయి. మన కూచిపూడిలో పుట్టి.. మన కూచిపూడి నాట్యాన్ని ప్రపంచస్థాయికి తీసుకెళ్లిన మహానుభావుడి జయంతి, ప్రపంచ కూచిపూడి దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

8లో

ఆంధ్రజ్యోతి

కృష్ణా

మంగళవారం 15 అక్టోబరు 2024

### ఆయన శిష్యరికం నా అదృష్టం



కూచిపూడి నాట్యానికి వన్నె తెచ్చిన మహనీయుడు వెంపటి చిన సత్యం. ఆయన శిష్యరికం నాకెంతో అదృష్టం. చెన్నైలో కూచిపూడి ఆర్ట్ అకాడమీని స్థాపించి వేలాది మంది కళాకారులను తీర్చిదిద్దిన ఘనత ఆయనకే దక్కింది. టీటీడీ ఆస్థాన నాట్యాచార్యులుగానే కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో అనేక అవార్డులు, సత్కారాలు పొందిన అపర సిద్ధేంద్రయోగి.

- డాక్టర్ వేదాంతం రాధేశ్యామ్,
కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత



రహదారుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న పవన్. చిత్రంలో మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ బాలాజీ, ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యేలు కాగిత కృష్ణప్రసాద్, బోడె ప్రసాద్, వర్ల కుమార్‌రాజా, వెనిగండ్ల రాము తదితరులు (ఇన్‌సెట్‌లో) గుడివాడలో మురుగుగా వస్తున్న తాగునీటి బాటిళ్లను చూపిస్తూ అక్కడికక్కడే సమస్య పరిష్కారానికి ఆదేశాలిచ్చిన పవన్



# పల్లెగూటికి పండగొచ్చింది

## జిల్లాకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వరాల జల్లు

- కంకిపాడు-రొయ్యూరు రోడ్డు ఆధునికీకరణకు ఆదేశాలు
- లంక గ్రామాల్లో అనుసంధాన రహదారులకూ ఓకే

**గుడివాడ నియోజకవర్గ తాగునీటి సమస్యకు చెక్**

**విజయవాడ/కంకిపాడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) :** డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కృష్ణాజిల్లాకు వరాల జల్లు కురిపించారు. కంకిపాడులో 'పల్లె పండుగ' కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యేలు, కలెక్టర్ తన దృష్టికి తీసుకొచ్చిన పలు అంశాలపై ఆయన అక్కడికక్కడే స్పందించారు. పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ కంకిపాడు-రొయ్యూరు వయా గోడవరం రోడ్డును ఆధునికీకరించాలని కోరారు. వెంటనే పవన్ స్పందిస్తూ.. దానిపై తగు చర్యలు తీసుకుని రోడ్డు వేసేలా ఆదేశాలు జారీ చేశారు. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ నందివాడ, గుడివాడ, గుడ్లవల్లేరు మండలాల్లోని 43 గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని, అక్కడి నీటిని ఓ బాటిల్‌లో పట్టి మరీ సమస్యను పవన్ కల్యాణ్‌కు వివరించారు. దీనిపై స్పందించిన పవన్.. గ్రామీణ రక్షిత మంచినీటి సరఫరా శాఖ అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి అక్కడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ ఎదురుమొండి-గొల్లమంద పరిధిలోని లంక గ్రామాలకు అనుసంధాన రహదారులు కావాలని ప్రతిపాదించారు. వాటిని కూడా పూర్తిచేసేందుకు డిప్యూటీ సీఎం ఆదేశాలిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ ఎమ్మెల్యేలు చేసింది శూన్యమని, కూటమి ప్రభుత్వంలో - మిగతా 6లో

# సిండికేట్‌లదే హవా!



లాటరీ తీసి మద్యం దుకాణాలను కేటాయిస్తున్న జేసీ గీతాంజలి శర్మ, ఎక్సైజ్ అధికారులు

## ఒక్కో మద్యం షాపునకు ఐదు నుంచి పది మంది వాటాదారులు

- లాటరీ పద్ధతిలో దుకాణాలు కేటాయించిన జేసీ గీతాంజలి
- రేపటి నుంచి ప్రారంభంకానున్న నూతన మద్యం దుకాణాలు
- మచిలీపట్నంలోని షాపులకు పెద్ద ఎత్తున బేరసారాలు

> ప్రభుత్వం మద్యం దుకాణాల ఏర్పాటుకు నిర్వహించిన లాటరీలో సిండికేట్‌ల హవానే నడిచింది. ఒక్కో షాపునకు ఐదు నుంచి పది మంది వరకు వాటాదారులు ఉండటంతో వారి చేతికే షాపులు చిక్కాయి. జిల్లాలోని 123 మద్యం దుకాణాల్లో ఎక్కువశాతం షాపులను సిండికేట్‌లే దక్కించుకున్నారు. మచిలీపట్నం హిందూ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్ద జేసీ గీతాంజలి శర్మ లాటరీ పద్ధతిలో షాపులను సోమవారం కేటాయించారు.

**ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం :** రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మద్యం పాలసీలో భాగంగా జిల్లాలో ఏర్పాటు చేయనున్న 123 మద్యం దుకాణాలకు సోమవారం లాటరీ ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది. మచిలీపట్నం హిందూ కళాశాల పీజీ బ్లాక్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ల ద్వారా ఉదయం ఎనిమిది గంటలకు మద్యం దుకాణాలను లాటరీ పద్ధతిన కేటాయించే కార్యక్రమాన్ని జేసీ గీతాంజలిశర్మ ప్రారంభించారు. జిల్లాలోని ఎనిమిది ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఒక్కో మద్యం షాపునకు దరఖాస్తు చేసుకున్న వారికి కేటాయించిన నంబర్ల ఆధారంగా దరఖాస్తుదారులను లోపలికి పిలిచారు. ఏ షాపునకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయో, వాటి నంబర్లతో ఉన్న కాయిన్‌లను ప్రదర్శించారు. ఈ కాయిన్‌లను డబ్బాలో వేసి జేసీ చేతుల మీదుగా లాటరీ తీశారు. మొదట వచ్చిన నంబరు వ్యక్తికి షాపును కేటాయిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. అతను నిర్దేశిత గడువులోగా నగదు చెల్లించకుంటే తర్వాత వారికి షాపును కేటాయించేలా మరో రెండు నంబర్లను కూడా లాటరీ తీసి రిజర్వులో ఉంచినట్లు స్పష్టం చేశారు. తొలుత మచిలీపట్నం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 14 మద్యం దుకాణాలకు లాటరీ తీశారు. వర్షం పడటం వల్ల బంటుమిల్లి ఎక్సైజ్‌స్టేషన్‌కు కేటాయించిన గదిలోనే మిగిలిన ఆరు ఎక్సైజ్ స్టేషన్‌లకు సంబంధించిన షాపులకు లాటరీ తీశారు. బంటుమిల్లి, మొవ్వ, గుడివాడ, నందివాడ, అవనిగడ్డ, గన్నవరం ఎక్సైజ్ స్టేషన్‌లలో పర్యవేక్షణ అధికారుల సమక్షంలో లాటరీ ప్రక్రియ కొనసాగింది. జిల్లా ఎక్సైజ్ విభాగం ఈఎస్ ఆర్.గంగాధరరావు, అసిస్టెంట్ ఈఎస్ భార్గవ్, ఎస్పీ ఆర్.గంగాధరరావు, ఆర్డీవో కె.స్వాతి లాటరీ ప్రక్రియను పర్యవేక్షించారు. కాగా, జిల్లాలో ఒక్కో మద్యం షాపునకు ఒక్కో గ్రూప్‌లో ఐదుగురికిపైగా సభ్యులు సిండికేట్‌గా ఏర్పడి మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు దరఖాస్తు చేశారు. జిల్లాలోని 123 మద్యం దుకాణాల్లో ఎక్కువ శాతం షాపులను సిండికేట్‌లే దక్కించుకున్నట్లు సమాచారం.

### లాటరీ కేంద్రాల వద్ద సైడ్‌లైట్స్

- 'నిడుమోలు లేదా కూచిపూడిలో మద్యం దుకాణం మీ పేరున వచ్చిందా. ఈ రెండు షాపుల్లో ఏదో ఒకటి మాకు ఇవ్వండి. మీ పార్టనర్లు ఎంతమంది ఉన్నారు? వారితో మాట్లాడి చెబితే చాలు. ఇప్పటికిప్పుడు నగదు ఏర్పాటు చేస్తాం. కాస్త సమయం తీసుకుని చెప్పినా పర్వాలేదు. మీ నిర్ణయం కోసం ఎదురుచూస్తూ ఉంటాం' అంటూ కొందరు వ్యాపారులు బేరాలకు దిగారు.
- 'మద్యం దుకాణాల కోసం 100 దరఖాస్తులు సమర్పిస్తే కేవలం మూడంటే మూడు మద్యం షాపులు వచ్చాయి. అందులో ఒకటి నా పేరున వచ్చింది. మరో రెండు షాపులు నా పార్టనర్ల పేర్లతో వచ్చాయి. మద్యం షాపుల కోసం చెల్లించిన నగదును ఎలా కూడగట్టుకోవాలో తెలియడంలేదు' అంటూ ఓ వ్యక్తి తన సహచరుల వద్ద ఆవేదన వ్యక్తం చేశాడు.
- గుడ్లవల్లేరు మండలంలో ఓ మహిళ ఐదు మద్యం షాపులకు దరఖాస్తు చేసుకుంటే ఏకంగా రెండు షాపులు ఆమె పేరున వచ్చాయి. దీంతో ఆ కుటుంబసభ్యుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.
- 'ఐదుగురు పార్టనర్లతో కలసి మద్యం షాపునకు దరఖాస్తు చేసుకుంటే లాటరీలో ఒక షాపు వచ్చింది. నా వాటాగా లైసెన్సు ఫీజు, సరుకు కొనుగోలు చేసేందుకు, ఇతరత్రా ఖర్చుల కోసం రూ. 5 లక్షలు కట్టాలి. నా స్నేహితుడు నగదు సమకూరుస్తానని చెప్పాడు. ఎప్పటిలోగా ఇస్తాడో తెలియడం లేదు' అంటూ ఓ వ్యాపారి ఫోన్‌లో తన స్నేహితులతో మాట్లాడుతూ కనిపించాడు.
- మచిలీపట్నంలోని 1వ నంబరు మద్యం దుకాణం కర్ణాటక రాష్ట్రానికి చెందిన మహేష్ బాటే దక్కించుకున్నారు. 2వ నంబరు షాపు ఉత్తరప్రదేశ్‌కు చెందిన లోకేశ్ చంద్ అనే వ్యక్తికి లాటరీలో వచ్చింది. 'ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ వ్యాపారం ఏం చేస్తారు. రెండు షాపులు మాకు ఇచ్చేయండి' అంటూ మచిలీపట్నం పరిసర ప్రాంతాల్లో మద్యం వ్యాపారంలో ఆరితేరిన వ్యాపారులు ఆ ఇద్దరితో బేరాలకు దిగారు. ఒక్కో షాపునకు పెద్దమొత్తంలో నగదు ఇస్తేనే షాపులు వదులుకుంటామని ఈ ఇద్దరు స్పష్టం చేసినట్లు సమాచారం.

### ప్రత్యేక కౌంటర్ల ద్వారా చలానాలు..

లాటరీ పద్ధతిలో మద్యం దుకాణాలు దక్కించుకున్న వారి నుంచి చలానాలు కట్టించుకునేందుకు హిందూ కళాశాల ప్రాంగణంలోనే రెండు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఇక్కడ చలానా కట్టిన తర్వాత డీడీలను బ్యాంకుల్లో ఇచ్చారు. ఏడాదికి రూ.65 లక్షలు చెల్లించాల్సి షాపుల నుంచి తొలి విడతగా రూ.10.80 లక్షలను, రూ.55లక్షలు చెల్లించాల్సిన షాపులకు రూ.9.16 లక్షలను కట్టించుకున్నారు. ఈ ప్రక్రియ మంగళవారం పూర్తయితే ఈ నెల 16వ తేదీ నుంచి నూతన మద్యం దుకాణాలు తెరచు కునేందు కు మద్యం లైసెన్సులను మంజూరు చేస్తామని కృష్ణాజిల్లా ఎక్సైజ్ విభాగం సూపరింటె ండెంట్ గంగాధరరావు తెలిపారు. వ్యాపారులు చెల్లించిన నగదు ఆధారంగా మద్యం ఇవ్వనున్నట్లు చెప్పారు.

# కొంపముంచేస్తున్నారు..!

## పీఎంఏవై లబ్ధిదారులకు గృహనిర్మాణ శాఖ మరో షాక్

- నిన్న నోటీసులు.. నేడు డబ్బు చెల్లించాలంటూ ఫోన్లు
- 'రీ వెరిఫికేషన్' పేరుతో ఉన్నతాధికారుల నిర్వాకం
- 300 యూనిట్ల విద్యుత్ వినియోగాన్ని సాకుగా చూపి..
- ప్రభుత్వం పట్టించుకోవాలని లబ్ధిదారుల విజ్ఞప్తి



**(ఆంధ్రజ్యోతి, విజయవాడ) :** ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) లబ్ధిదారులను గృహనిర్మాణ శాఖ ఉన్నతాధికారులు నానా ఇబ్బందులు పెడుతున్నారు. లబ్ధిదారులపై అనర్హత వేటు వేసేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. ఎప్పుడో కట్టుకున్న ఇళ్లకు, పురోగతిలో ఉన్న ఇళ్లకు విద్యుత్ బిల్లు వినియోగం 300 యూనిట్లు దాటిందన్న పేరుతో ఇప్పటికే అనర్హుల జాబితాలో చేర్చిన సంగతి తెలిసిందే. తాజాగా.. అనర్హతను బట్టి ఈ పథకం కింద పొందిన రూ.1.50 లక్షల సాయాన్ని తిరిగి చెల్లించాలంటూ లబ్ధిదారుల మెడపై కత్తి పెడుతున్నారు. 'మీరు అనర్హులుగా మారారు. పీఎంఏవై డబ్బును తిరిగి చెల్లించండి..' అంటూ గ్రామ సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్ల ద్వారా లబ్ధిదారులకు ఫోన్లు చేయిస్తున్నారు. ఇళ్లు నిర్మించుకున్నాం కాబట్టి తమకొచ్చిన నష్టమేమీ లేదని కొంత మంది లబ్ధిదారులు భావిస్తున్నా.. మరికొంతమంది మాత్రం కోర్టును ఆశ్రయించాలనుకుంటున్నారు. ఇళ్లు కట్టుకున్నాక డబ్బు తిరిగి చెల్లించమనటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

### గృహనిర్మాణ శాఖ అత్యుత్సాహమే..

ఈ సమస్యకు గృహ నిర్మాణ శాఖ అధికారుల అత్యుత్సాహమే ప్రధాన కారణం. ప్రభుత్వ మెప్పు కోసం పీఎంఏవై పథకంలో ఏవో అక్రమాలు జరిగిపోయాయంటూ రీ వెరిఫికేషన్‌కు తెరతీశారు. సుబ్బారావు అనే వ్యక్తికి పీఎంఏవై కింద ఇల్లు మంజూరైతే.. అందుకు భిన్నంగా శ్రీనివాసరావు అనే వ్యక్తి ఇల్లు కట్టుకుంటే.. అనర్హుల జాబితాలో చేర్చవచ్చు. అలాకాకుండా ఏదో రకంగా ప్రభుత్వానికి రిమార్కులు చూపించటం కోసం సిక్స్ పాయింట్ ఫార్ములా వెరిఫికేషన్‌ను తెరపైకి తెచ్చారు. ఈ ఫార్ములా ప్రకారం విద్యుత్ వినియోగం 300 యూనిట్లు దాటకూడదన్న సాకును చూపించారు. ఇల్లు కట్టాక విద్యుత్ వినియోగంపై అనర్హత వేటు వేయడమేమిటనే ప్రశ్నలు వస్తున్నాయి. పీఎంఏవై మార్గదర్శకాల ప్రకారం సొంత స్థలం కలిగి ఉండి, దారిద్ర్యరేఖకు దిగువన ఉంటే చాలు.. ఈ పథకానికి అర్హత సాధిస్తారు. కేంద్రం కూడా అర్హతను పరిశీలించాకే ఆమోదం తెలుపుతుంది. వాటన్నింటినీ తోసిపుచ్చి అనర్హత వేటుతో పాటు మెడపై కత్తి పెట్టినట్టుగా డబ్బు తిరిగి చెల్లించమనడంపై లబ్ధిదారులు మండిపడుతున్నారు.

### లబ్ధిదారుల్లో ఆందోళన

ఈ పథకంతో ఇల్లు కట్టుకున్నాక ఇప్పుడు ఈ అనర్హతలేమిటంటూ లబ్ధిదారులు తలలు పట్టుకుంటున్నారు. ఈ పథకం ద్వారా వచ్చిన డబ్బు ఇంటికి ఖర్చు చేశామని, తిరిగి ఇవ్వమంటే ఎక్కడి నుంచి - మిగతా 6లో

## గుండెల్లో రైళ్లు

- వరుస ప్రమాదాలతో భీతిల్లుతున్న ప్రయాణికులు
- సిగ్నలింగ్, ట్రాక్ చేంజ్ సందర్భాలలోనే ఎక్కువ ఘటనలు

6లో

## అర్జీలు క్షేత్ర స్థాయిలో విచారించి పరిష్కరించాలి

» డీఆర్‌ఓ చంద్రశేఖరరావు

6లో

## కరకట్ట రోడ్డు విస్తరణకు సీఆర్‌డీఏ సన్నాహాలు

6లో

## రాకెట్ ప్రయోగాలకు అనువైన ప్రాంతం గుల్లలమోద

6లో

## కవుతరం మత్స్యకారుల నిరసన ప్రదర్శన

6లో



కోనేరు సెంటర్లో నిలిచిన వర్షపు నీరు

# జిల్లాలో భారీ వర్షం

## మరో 2 రోజుల పాటు కోస్తా తీరంలో వర్షాలు కురిసే అవకాశం

- అధికారులను అప్రమత్తం చేసిన కలెక్టర్
- బిర్రుపొట్ట దశ వరి పొలాలకు మేలు

**మచిలీపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లా వ్యాప్తంగా సోమవారం విడతలవారీగా భారీ వర్షం కురిసింది. నాగాయలంకలో అత్యధికంగా 55.4 మిల్లీమీటర్లు, ఉయ్యూరులో అత్యల్పంగా 3.2 మిల్లీమీటర్ల వర్షం పడింది. జిల్లా సగటు వర్షపాతం 8.0 మిల్లీమీటర్లుగా నమోదైంది. కోస్తాతీరం వెంబడి రానున్న రెండు రోజుల్లో 20 సెంటీ మీటర్ల కన్నా అధికంగా వర్షపాతం నమోదవుతుందని వాతావరణశాఖ హెచ్చరించింది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షంతోపాటు గంటకు 35 నుంచి 45 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. రానున్న రెండు రోజులపాటు దక్షిణ కోస్తాతీరం మొత్తాన్ని ఆరెంజ్ అలర్ట్‌గా వాతావరణశాఖ ప్రకటించింది.

### వర్షాలతో వరికి మేలు

జిల్లాలో ముందస్తుగా వరినాట్లు పూర్తి చేసిన పొలాల్లో వరిపైరు బిర్రుపొట్ట దశలో ఉంది. ప్రధానంగా కంకిపాడు, ఉయ్యూరు పామర్రు, తోట్లవల్లూరు, తదితర మండలాల్లోని వరిపైరుకు వర్షాలు మేలు చేస్తాయని రైతులు చెబుతున్నారు. పైరు త్వరితగతిన ఈతకు వస్తుందని పేర్కొంటున్నారు. వాతావరణంలో మరింతగా మార్పులు చోటుచేసుకుంటే వరిపైరుకు తెగుళ్లు ఆశించే ప్రమాదం కూడా ఉందని రైతులు భయపడుతున్నారు. కాలువ శివారు ప్రాంతాల్లో 45 రోజులకు పైబడిన వరిపైరుకు ఎరువులు వేసి ఉంటే మరింత ఏపుగా ఎదుగుతుందని, శివారు ప్రాంతాలకు సాగునీటి ఎద్దడి కొంతమేర తగ్గుతుందని రైతులు చెబుతున్నారు.

### జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ బాలాజీ

భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలోని అన్ని విభాగాల అధికారులు ఈ నెల 17వ తేదీ వరకు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. తహసీల్దార్లు, రెవెన్యూ డివిజన్ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేలా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని చెప్పారు. జిల్లా, డివిజన్ స్థాయిలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని అధికారులకు సూచించారు.

# గుండెల్లో రైళ్లు!



చెన్నయ్ దుర్ఘటన (ఫైల్)



- వరుస ప్రమాదాలతో భీతిల్లుతున్న ప్రయాణికులు
- నివారించకపోతే.. రైల్వేపై నమ్మకం పోతుంది
- సిగ్నలింగ్, ట్రాక్ ఛేంజ్ సందర్భాలలోనే ఎక్కువ ప్రమాదాలు
- ప్రయాణికులకు రక్షణ కల్పించలేకపోతున్న ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు
- ఆధునిక టెక్నాలజీ చెంత ఉన్నా ప్రమాదాలకు చెక్ పెట్టలేరా?

**రోజుకోచోట ట్రాక్ తప్పుతూ ప్రయాణికుల గుండెల్లో 'రైళ్లు' పరిగెత్తిస్తున్నాయి.. బాలాసోర్ ఉదంతం తర్వాత ఇటీవలి కాలంలో వరుసగా రైళ్లు పట్టాలు తప్పటం, ఎదురెదురుగా ఢీకొట్టడం, భోగీలు ఎగిరిపడుతుండటంతో రైలు ప్రయాణికులకు తీవ్ర భయాందోళనలు కలిగిస్తోంది. ఒకప్పుడు అత్యంత సురక్షితమైన రవాణా వ్యవస్థల్లో రైల్వేను ప్రధానంగా చెప్పుకున్నా.. ఇటీవల కాలంలో రైళ్లు పట్టాలు తప్పుతుండటంతో ప్రయాణికుల్లో భయాన్ని పెంచుతోంది. బాలాసోర్ దుర్ఘటన ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగించగా.. ఆ తర్వాత పలు సందర్భాలలో రైళ్లు పట్టాలు తప్పటం.. తాజాగా చెన్నై దుర్ఘటతో రైలు ప్రయాణమంటేనే అభద్రతాభావనకు గురయ్యే పరిస్థితి నెలకొంది.**

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

రైలు ప్రమాదాలు జరిగిన ప్రతిసారీ అధికారులు సరికొత్త వాదనలకు తెరదీస్తున్నారు. రైల్వే ఎదుర్కొంటున్న సమస్యలను పక్కదారి పట్టించేలా.. ఒక్కో ప్రమాదం ఒక్కో వాదన తెరపైకి వస్తోంది. తాజాగా చెన్నై రైలు ప్రమాదంలో కుట్ర కోణం ఉందని వాదిస్తున్నారు. ఇటీవల కాలంలో జరిగిన పలు ఘటనల దృష్ట్యా సిగ్నలింగ్ ఆధారిత సమస్యలు తలెత్తుతున్నాయి. దాంతోపాటుగా ట్రాక్ నుంచి రైలు మారే సందర్భంలో కూడా సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ రెండింటి కారణంగానే ప్రమాదాలు జరుగుతున్నాయన్నది ఇటీవల పలు ప్రమాదాలను చూస్తే అర్థమౌతోంది.

● బాలాసోర్ ఉదంతం తర్వాత దేశంలోనే రెండో అతిపెద్ద జంక్షన్ అయిన విజయవాడ డివిజన్ పరిధిలో ట్రాక్ దృఢత్వాన్ని పెంచే పనులు, ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. నాన్ ఇంటర్ లాకింగ్ పనులు పెద్దఎత్తున జరుగుతున్నాయి. భద్రత విషయంలో రాజీలేకుండా పనిచేస్తున్నారు. దీంతో భారీ సంఖ్యలో రైళ్లను కూడా రద్దు చేస్తున్నారు.



● చెన్నయ్ ఘోర దుర్ఘటనతో విజయవాడ డివిజన్ ప్రయాణికులు ఉలిక్కిపడ్డారు. విజయవాడ నుంచి పెద్ద సంఖ్యలో ప్రయాణాలు చేసేది చెన్నైకే.. విజయవాడ డివిజన్ పరిధిలో నడిచే రైళ్ల అత్యధికంగా చెన్నైకే కావటం గమనార్హం. ఆ తర్వాతే సికింద్రాబాద్, బెంగళూరు, విశాఖపట్నంలకు రాకపోకలు సాగిస్తుంటారు. పండగ ముందు చెన్నై ప్రమాదంతో ప్రజలు ఉలిక్కిపడ్డారు. టెక్నాలజీ విస్తరిస్తున్న తరుణంలోనే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఎల్‌హెచ్‌బీ బోగీలు వచ్చిన తర్వాత రైళ్లు గుద్దుకున్నా బోగీలు బ్యాలెన్స్ తప్పవని, ప్రయాణికులకు భద్రత ఉంటుందని చెబుతున్నా.. బాలాసోర్ ఉదంతంలో ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు కూడా ప్రయాణికుల ప్రాణాలను నిలపలేకపోయాయి. ప్రమాదాలను నివారించే కవచ్ వంటి రక్షణాత్మక వ్యవస్థలు కూడా చాలా పరిమితంగానే అమలు చేయటం జరిగింది. వరుస ప్రమాదాలతో రైల్వే ప్రతిష్ఠ మసకబారుతోంది. ప్రయాణికులకు భద్రతను కల్పించకపోతే రానున్న రోజుల్లో రైలు ప్రయాణికులు దూరమయ్యే పరిస్థితి నెలకొంటుంది. ప్రయాణికుల సేఫ్టీ కోసం మరింతగా అధికారులు ఆధునిక టెక్నాలజీని వినియోగించాల్సిన అవసరం ఉంది.

## రాకెట్ ప్రయోగాలకు అనువైన ప్రాంతం గుల్లలమోద

» సతీష్‌రెడ్డి చొరవకు మండలి బుద్ధప్రసాద్ అభినందన

**నాగాయలంక, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) :** కేంద్ర ప్రభుత్వం నాగాయలంక మండలంలో గుల్లలమోదకు క్షిపణి పరీక్షా కేంద్రాన్ని మంజూరు చేసిన సందర్భంగా డీఆర్‌డీవో పూర్వపు ఛైర్మన్ జి.సతీష్‌రెడ్డిని సోమవారం విజయవాడలో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, ప్రధాని మోదీ సారథ్యంలోని హైలెవల్ సెక్యూరిటీ కమిటీ నిర్ణయం మేరకు గుల్లలమోదకు నియోజకవర్గానికి మహత్తర ప్రాజెక్టు ఇచ్చిందన్నారు. రాకెట్ ప్రయోగాలకు గుల్లలమోద అనువైన ప్రాంతంగా శాటిలైట్ ద్వారా గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుకు ఎంపిక చేస్తే గత ఐదేళ్లలో రాష్ట్ర సహకారం లేక ముందుకు సాగలేదన్నారు. ఈ దశలో సతీష్ రెడ్డి క్షిపణి పరీక్షాకేంద్రానికి పర్యావరణ అనుమతుల కోసం విశేష కృషి చేశారాన్నరు. నియోజకవర్గానికి రూ.20 వేల కోట్ల నుంచి రూ.30 వేలకోట్ల నిధులు ఇచ్చే ప్రాజెక్టు మంజూరు చేసిన ప్రధాని మోదీకి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో సెక్యూరిటీ కమిటీ కౌన్సిల్ గుల్లలమోద క్షిపణి పరీక్ష కేంద్రానికి ఆమోదం తెలిపినట్టు సతీష్ రెడ్డి చెప్పారు. అవనిగడ్డ నియోజకవర్గంతోపాటు జిల్లాలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. త్వరితగతిన ఈ కేంద్రం ద్వారా దేశానికి మరిన్ని క్షిపణులు అందించాలని ఆయన ఆకాంక్షించారు.



జి.సతీష్‌రెడ్డిని సత్కరిస్తున్న మండలి బుద్ధప్రసాద్

### దుర్గమ్మ సేవలో సతీష్ రెడ్డి

**వన్‌టౌన్ :** ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను సోమవారం కేంద్ర రక్షణమంత్రి సాంకేతిక సలహాదారు, డీఆర్‌డీవో పూర్వపు ఛైర్మన్, సతీష్ రెడ్డి దర్శించుకున్నారు. ఈవో రామారావు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితులు ఆశీస్సులతో పాటు లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం, అమ్మవారి చిత్రపటం అందజేశారు.



సతీష్ రెడ్డికి దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న ఈవో



కలెక్టరేట్ వద్ద కవుతరం మత్స్యకార సంఘం సభ్యుల ప్రదర్శన

## అక్రమాలపై చర్యలు తీసుకోండి

» కవుతరం మత్స్యకార సంఘ సభ్యుల నిరసన ప్రదర్శన

**మచిలీపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) :** మూడేళ్లుగా లెక్కలు చెప్పడంలేదని, సంఘపాలకవర్గం అక్రమాలకు పాల్పడుతోందంటూ కవుతరం మత్స్యకార సహకార సంఘ సభ్యులు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. మూడేళ్లుగా సుమారు రూ. 24 లక్షల ఆదాయం వచ్చిందని, ఆదాయ-జమ ఖర్చులు సభ్యులకు తెలపడంలేదని సంఘ సభ్యులు మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. సర్వసభ్య సమావేశాలు ఏర్పాటు చేసి ఆదాయ వ్యయాలు చెప్పాలని పాలకవర్గ సభ్యులను అడుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. అధ్యక్షుడు, కార్యదర్శి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారని సంఘసభ్యులు ఏడుకొండలు తదితరులు ఆరోపిస్తున్నారు. లీజుకు ఇచ్చిన సొమ్మును బ్యాంకులో జమ చేయలేదని, బోనస్‌ను సభ్యులకు పంచడంలేదన్నారు. అక్రమాలపై జిల్లా మత్స్యశాఖ అధ్యక్షుడు, కలెక్టర్ తగిన న్యాయం చేయాలన్నారు.

## అర్జీలు క్షేత్ర స్థాయిలో విచారించి పరిష్కరించాలి

» డీఆర్వో చంద్రశేఖరరావు

**మచిలీపట్నం టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) :** ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి సత్వరం పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖరరావు అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశపు హాలులో 'మీకోసం' కార్యక్రమంలో చంద్రశేఖరరావు, కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటి కలెక్టర్ శ్రీదేవి ప్రజలనుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ, అర్జీలను గడువులోగా పరిష్కరించాలన్నారు. కోర్టు కేసులకు సత్వరమే వకాలత్‌లు ఫైల్ చేయాలన్నారు. ప్రతి నెలా 5న ఆర్టీఐ నివేదికలు పంపాలన్నారు. వీల్‌చైర్లు అడిగిన దివ్యాంగులకు వెంటనే ఇప్పించాలన్నారు. ప్రత్యేక ఉపకలెక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కార్యాలయాల నుంచి వచ్చే అర్జీలు సత్వరమే పరిష్కరించి కలెక్టరు ముందుంచాలన్నారు.

● మచిలీపట్నం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్‌లను కాంట్రాక్టరు కట్టడంలేదని ఏఐటీయూసీ నాయకులు ఒఎల్‌రావు, ఎం ఫణీంద్రలు వినతి పత్రం సమర్పించారు. 25 ఏళ్ళుగా పనిచేస్తున్నామని అరకొర జీతాలు చెల్లిస్తున్నారని కార్మికులు తెలిపారు. జీతాలు పెంచాలని కోరారు.



ప్రజలనుంచి అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో కె.చంద్రశేఖరరావు, కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి

● వరదకు తాము పండించిన వరి, పసుపు పూర్తిగా పాడయ్యాయని, తమకు నష్టపరిహారం అందలేదని తోట్ల వల్లూరు మండలం రొయ్యూరు గ్రామానికి చెందిన మోర్ల సత్యనారాయణ, శివపార్వతి, లుక్కా శివనారాయణ, రమాదేవి తదితర రైతులు అర్జీ సమర్పించారు. నష్టపరిహారం ఇప్పించాలని కోరారు.

● ఆధార్‌కార్డు ఇప్పించాలని మచిలీపట్నం కాలేఖాన్‌పేటకు చెందిన తుమ్మా రాఘవులు కోరారు.

● అధిక వర్షాలకు పంట నష్టపోయామని, నష్ట పరిహారం తమకు చెల్లించలేదని పెడన మండలం సేరీ వర్లులపల్లి, ముచ్చిలగుంట గ్రామాలకు చెందిన రైతులు జన్ను నారాయణమ్మ, పుట్టి బ్రహ్మయ్యలు కోరారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి తాహెరా సుల్తానా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జి.గీతాభాయి, హౌసింగ్ పీడీ ఎస్.వెంకట్రావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎన్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## టాటా మృతి తీరని లోటు

**ఆటోనగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) :** రతన్ టాటా మృతి కేవలం దేశానికే కాదని, ప్రపంచానికి తీరని లోటని మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు అన్నారు. సోమవారం ఆటోనగర్‌లోని ది విజయవాడ ఇండస్ట్రీయల్ ఎస్టేట్ మ్యాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్, జె.ఆర్.డి టాటా ఐలా సర్వీసెస్ సొసైటీ, ఏపీ ఎం.ఎస్.ఎం.ఈ ఇండస్ట్రీస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడ ఇండస్ట్రీయల్ ఎస్టేట్ మ్యాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ హాల్‌లో రతన్ టాటాకి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రతన్ టాటా విలువలకు, నీతి నిజాయితీకి నిలువెత్తు నిదర్శమని కొనియాడారు. తన ఆదాయంలో సగానికి పైగా సేవా కార్యక్రమాలకు ఉపయోగించడంతో ప్రజల మనసుల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. విదేశాల్లోని ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల్లో భారతీయ విద్యార్థులకు నేరుగా ప్రవేశం లభించాలన్నదే రతన్ టాటా లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎం.ఎస్.ఎం.ఈ బాయిన వెంకట్రావు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోకరాజు గంగరాజు

### న్యూస్ బాక్స్



శ్రీకాకుళేశ్వరుని సన్నిధిలో అన్నపూర్ణ

#### శ్రీకాకుళేశ్వరుని దర్శించిన సినీనటి అన్నపూర్ణ

**ఘంటసాల:** శ్రీకాకుళం గ్రామంలో శ్రీకాకుళేశ్వరస్వామిని సినీనటి అన్నపూర్ణ సోమవారం దర్శించుకున్నారు. అర్చకులు ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారి పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాల వేశారు.



ఫ్లెక్సీలను తొలగిస్తున్న తాతయ్య

#### పోస్టర్, ఫ్లెక్సీ రహిత పట్టణంగా జగ్గయ్యపేట

**జగ్గయ్యపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) :** పోస్టర్లు, ఫ్లెక్సీలులేని సుందర జగ్గయ్యపేటగా తీర్చిదదిద్దేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు సహకరించాలని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్రలు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని వివిధ సందర్భాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, పోస్టర్ల తొలగింపుకు వారు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా తాతయ్య మాట్లాడుతూ, మంత్రి పి.నారాయణ నెల్లూరును పోస్టర్లు, ఫ్లెక్సీల రహితంగా తీర్చిదిద్దేందుకు శ్రీకారం చుట్టారన్నారు. ముందుగా తాము ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగిస్తున్నామని తెలిపారు. ఇతర పార్టీల వారు తమ ఫ్లెక్సీలను తొలగించాలని కోరారు. ఫ్లెక్సీల వల్ల ప్రధాన రహదారులు మూసుకుపోయి ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించేందుకు ఈ చర్య ఉపక్రమిస్తుందని తెలిపారు. రెండు, మూడు రోజులు అవకాశం ఇస్తామన్నారు. ముందస్తుగా అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినా అంగీకరించబోమని చెప్పారు. పురపాలక సంఘ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.



## కరకట్ట రోడ్డు విస్తరణకు సీఆర్‌డీఏ సన్నాహకాలు

» భూముల కోసం సీఆర్‌డీఏ అధ్యయనం

» 4 వరుసలుగా విస్తరించాలని నిర్ణయం

**విజయవాడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) :** అమరావతి రాజధానికి విజయవాడ నుంచి అత్యంత ప్రధానమైన కరకట్ట మార్గాన్ని నాలుగు వరుసలుగా అభివృద్ధి చేసేందుకు సీఆర్‌డీఏ అధికారులు సన్నాహకాలు చేపడుతున్నారు. టెండర్లు పిలవటానికి కొంత సమయం పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. కరకట్ట రోడ్డును నాలుగు వరుసలుగా అభివృద్ధి చేయాలని గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే నిర్ణయించటం జరిగింది. సీడ్ యాక్సెస్ మొదటి దశ పనుల నేపథ్యంలో దీని పనులు చేపట్టలేదు. ఈ లోపు ఎన్నికలు రావటం వైసీపీ ప్రభుత్వ ఏర్పడింది. కరకట్ట రోడ్డును రెండు వరుసలుగా అభివృద్ధి చేసేందుకు వైసీపీ ప్రభుత్వం ఇరిగేషన్ అధికారులకు పనులు అప్పగించింది. భూముల ఇబ్బందుల వల్ల ఈ పనులు ముందు సాగలేదు. కేవలం 3 ఎకరాల దగ్గర సమస్య రావటంతో కరకట్ట విస్తరణ పనులు సాధ్యం కాలేదు. మళ్ళీ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో తిరిగి నాలుగు వరుసలుగా విస్తరించాలని నిర్ణయించింది. ప్రస్తుతం నాలుగు వరుసలుగా చేస్తున్న నేపథ్యంలో, అదనంగా భూములను సేకరించాల్సి వస్తోంది. ఈ మేరకు సీఆర్‌డీఏ అధికారులు ఎంత భూములు అవసరమౌతుందన్న దానిపై అధ్యయనం చేస్తున్నారు. భూముల ప్రతిపాదన కొలిక్కి రాగానే.. ఈ ప్రక్రియను చేపట్టాలని భావిస్తున్నారు. భూ సమీకరణ, భూ సేకరణ విధానంలో వీలును బట్టి వెళ్లాలని సీఆర్‌డీఏ భావిస్తోంది.

## విద్యార్థి మృతదేహం లభ్యం

**వన్‌టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):** కృష్ణలంక స్వర్గపురి ఘాట్ కృష్ణానదిలో స్నానం చేయటానికి దిగి గల్లంతైన రేపల్లె రాజ్ (21) మృతదేహం సోమవారం లభ్యమైంది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. కృష్ణాజిల్లా అవనిగడ్డ, కొత్తపాలెంకు చెందిన రేపల్లె రాజ్ నగరంలోని ఓ హాస్టల్‌లో ఉంటూ ఎంఏ చదువుతున్నాడు. స్నేహితులైన పోతినేని కేశవ, వెక్కల విష్ణువర్ధన్‌లతో కలిసి ఆదివారం సరదాగా కృష్ణానదిలో స్నానం చేసేందుకు స్వర్గపురి ఘాట్ వద్ద నదిలో దిగారు. రేపల్లె రాజ్ ప్రమాదవశాత్తు నదిలో గల్లంతయ్యాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ బృందం నదిలో గాలించినప్పటికీ అతడి ఆచూకీ దొరకలేదు. సోమవారం ఉదయం గల్లంతైన ప్రదేశంలోనే మృతదేహాన్ని గుర్తించారు.





రాజ్ ఇంటివద్ద భారీగా బంధువులు, గ్రామస్థులు

### స్వగ్రామంలో విషాదఛాయలు..

**కోడూరు :** మండల పరిధిలోని వి.కొత్తపాలెంలో గ్రామానికి చెందిన యువకుడు విద్యనభ్యసించేందుకు విజయవాడ వెళ్లి శవమై రావటంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన రేపల్లె అజయ్ కుమారుడు రేపల్లె రాజా (20) విజయవాడలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి ఎంఏ చదువుతున్నాడు. దసరా సెలవులకు కూడా ఇంటికి రాకుండా ప్రత్యేక కోచింగ్ ఉందని విజయవాడలోనే ఉన్నాడు. ఆదివారం సాయంత్రం తన స్నేహితులతో కలిసి విజయవాడలో కృష్ణానదిలో గల్లంతైన రాజా సోమవారం ఉదయానికి శవమై తేలటంతో కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగారు. సాధారణ రైతు కుటుంబానికి చెందిన అజయ్‌కు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడిపైనే కోటి ఆశలు పెట్టుకున్న ఆ తండ్రి కుమారుడి ఉన్నత చదువుల కోసం ఖర్చు చేస్తున్నాడు. త్వరలో కొడుకు ఉన్నతస్థితికి ఎదుగుతాడని ఆశ పడగా, ఇంతలోనే మృత్యుఒడిలోకి చేరుకోవటంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తీరు పలువురిని కలచివేస్తోంది. సోమవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామమైన వి.కొత్తపాలెం గ్రామానికి తీసుకురాగా, పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు తరలివచ్చి మృతదేహాన్ని సందర్శించారు. తల్లిదండ్రుల శోకాన్ని చూసి చలించిపోయారు. అనంతరం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

## నేడు ఐఎంఏ వైద్యుల నిరాహార దీక్షలు

» బెంగాల్‌లో జూ.డాల ఆమరణ దీక్షకు సంఘీభావం

**ఆటోనగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):** పశ్చిమబెంగాల్‌లో వైద్య విద్యార్థిని హత్యాచార ఘటనలో బాధితురాలికి న్యాయం చేయాలని, పని ప్రదేశాల్లో భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ కోల్‌కతాలో జూనియర్ డాక్టర్లు చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షకు ఐఎంఏ సంఘీభావం ప్రకటించింది. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని మెడికల్ కాలేజీల్లో 12 గంటల పాటు నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు ఐఎంఏ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎం.జయచంద్రనాయుడు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.ఫణిదర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోల్‌కతాలో గత 9 రోజులుగా జూనియర్ వైద్యులు చేస్తున్న నిరవధిక నిరాహార దీక్షకు మద్దతుగా దేశవ్యాప్తంగా నిరాహార దీక్షలు చేపట్టాలని ఐఎంఏ పిలుపునిచ్చిందని తెలిపారు. ఇందులో భాగంగా అక్టోబరు 15న ఉదయం 6 నుంచి సాయత్రం 6 గంటల వరకు రాష్ట్రంలో అన్ని మెడికల్ కాలేజీల్లో దీక్షలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొనాలని కోరారు. బెంగాల్‌లోని జూనియర్ వైద్యుల డిమాండ్లను బెంగాల్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం అంగీకరించాలని డిమాండ్ చేశారు. విజయనగరం మహారాజా వైద్య కళాశాలలో జరిగే నిరాహార దీక్షలో ఎం.జయచంద్రనాయుడు, విజయవాడ మెడికల్ కాలేజీలో ఫణిదర్, ఇతర చోట్ల ఐఎంఏ నాయకులు, విద్యార్థులు పాల్గొననున్నారు.

## కొంపముంచేస్తున్నారు..!

(5వ పేజీ తరువాయి)

తెచ్చి ఇవ్వాలని ప్రశ్నిస్తున్నారు. పీఎంఏవై కింద కేంద్రం ఇచ్చిన రూ.1.50 లక్షలు కొంతమేర సాయపడినా, పూర్తి ఇంటి ఖర్చుకు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఖర్చయిందని, ఆ మొత్తాన్ని అప్పు చేసుకున్నామని చెబుతున్నారు. ఇల్లు నిర్మించుకుని మూడేళ్లవుతున్నా ఇంకా పూర్తి సాయం అందలేదని, చాలామందికి రూ.30 వేల డబ్బు చెల్లించాల్సి ఉందంటున్నారు. కాగా, ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నవారికి ఇంకా రూ.70 వేలు, ఆపైన చెల్లించాల్సి ఉంది. ఈ డబ్బును తక్షణం చెల్లించటం ద్వారా లబ్ధిదారులకు ఉపయుక్తంగా ఉంటుంది. ఆ పని చేయకుండా రీ వెరిఫికేషన్ పేరుతో ఇలా ఇబ్బంది పెట్టడం దారుణమని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇవ్వాల్సిన డబ్బు ఇవ్వకుండా తప్పించుకునేందుకే ఇలా చేస్తున్నారని మండిపడుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి గృహనిర్మాణ శాఖ ఉన్నతాధికారులు చేసిన తప్పును సరిదిద్దాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## పల్లెగూటికి పండగొచ్చింది

(5వ పేజీ తరువాయి)

ప్రజాప్రతినిధులు బాధ్యతగా నడుచుకోవడం చూస్తుంటే ముచ్చటగా ఉందన్నారు. మచిలీపట్నం ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ మచిలీపట్నం-రేపల్లె రైల్వేలైన్ విషయాన్ని తన దృష్టికి తీసుకొచ్చారని, తప్పకుండా దాన్ని ప్రధాని నరేంద్రమోదీ వివరిస్తానన్నారు.

సర్పంచులు రోడ్డు పాలయ్యారు : మంత్రి కొల్లు రవీంద్ర

గత ప్రభుత్వ హయాంలో రోడ్లు వేసినవారు రోడ్డు పాలయ్యారని మంత్రి కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు. వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో సర్పంచులు ఆస్తులు అమ్ముకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. పల్లెల్లో పండుగ వాతావరణం తెచ్చేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. జగన్ ప్రభుత్వం రూ.12 వేల కోట్ల కేంద్ర నిధులను ఖర్చు చేయకుండా దారి మళ్లించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పవన్ కల్యాణ్ అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పని చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం పంచాయతీ కార్యాలయాలకు పార్టీ రంగులు వేసుకోవడం తప్ప గ్రామాల్లో అభివృద్ధి చేసింది లేదన్నారు. గత ప్రభుత్వంలో మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా పదవులు వెలగబెట్టిన నాయకులు జిల్లాకు ఏమీ చేయకపోగా జిల్లా పరువు తీశారని మండిపడ్డారు.

మహాత్ముడి స్ఫూర్తితో పల్లె పండుగ : బాలశౌరి

గ్రామాలు సామాజికంగా, ఆర్థికంగా పరిపుష్టి చెందితేనే అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందుతాయనే మహాత్మాగాంధీ మాటలను స్ఫూర్తిగా తీసుకుని పవన్ కల్యాణ్ పల్లె పండుగ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. పవన్ వ్యక్తి కాదు, శక్తి అన్నారు. స్వయంగా ప్రధాని మంత్రి నరేంద్రమోదీనే 'పవన్ కాదు.. తుఫాన్' అని కొనియాడారన్నారు. ఒకేసారి 13,326 గ్రామసభలు నిర్వహించడం ఒక రికార్డు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే పల్లెల్లో అభివృద్ధి చూస్తున్నామన్నారు. మచిలీపట్నం రేపల్లె రైల్వే ప్రాజెక్టును పూర్తి చేసి ప్రజల కల నెరవేస్తామన్నారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రూ.4,500 కోట్లతో మొదలవుతున్న పనులు సంక్రాంతికి పూర్తయితే గ్రామాలు స్వర్గసీమలను తలపిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, కాగిత కృష్ణప్రసాద్, వర్ల కుమార్‌రాజా, ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, మాజీ వైస్ ఎంపీపీ కోయా ఆనంద్, సర్పంచ్ బాకి రమణ, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.




కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న గద్దె రామ్మోహన్

## దక్షిణ భారత్‌లో డై పోల్ విస్తరణ

» నగరంలో బ్రాంచి ప్రారంభం

**పటమట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) :** ఆస్ట్రేలియాలో 12 ఏళ్లుగా ఐటీ, కమ్యూనికేషన్స్ బ్రాడ్‌కాస్టింగ్ రంగంలో సేవలందిస్తున్న డై పోల్ గ్రూప్ భారత్‌లో తన కార్యకలాపాల విస్తరణకు శ్రీకారం చుట్టింది. విజయవాడలో నూతన కార్యాలయాన్ని గద్దె రామ్మోహన్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో యువతకు, ముఖ్యంగా విజయవాడలో ఉపాధి అవకాశాలను డై పోల్ సృష్టించాలని కోరారు. సంస్థ వ్యవస్థాపకుడు రవి నెక్కలపూడి మాట్లాడుతూ, వచ్చే మూడు నుంచి ఐదేళ్లలో 500 మందికిపైగా ఐటీ నిపుణులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ సాగర్ చాప్కే, డై పోల్ ప్రతినిధులు పాల్గొన్నారు.



జాతీయ స్థాయి సేవా థార్మిక్ అవార్డును అందుకుంటున్న హెల్పింగ్ హ్యాండ్స్ సీహెచ్ వెంకట్

## హెల్పింగ్ హ్యాండ్స్‌కు సేవా థార్మిక్ అవార్డు

**ఆటోనగర్ :** లతా రాజా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 17వ జాతీయస్థాయి సేవా థార్మిక్ అవార్డును విజయవాడకు చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సీహెచ్ వెంకట్ సోమవారం నల్గొండలో అందుకున్నారు. ప్రతి రాష్ట్రం నుంచి నలుగురిని ఎంపిక చేసి వారికి జాతీయ సేవా థార్మిక్ అవార్డును ఫౌండేషన్ అందిస్తోంది. దీంతో పాటు రూ.లక్ష నగదుబహుమతిని మాజీ డీజీపీ సి.ఆంజనేయరెడ్డి అందజేశారు. అనంతరం వెంకట్‌ను శాలువాతో సత్కరించారు.

## బ్రాయిలర్ ధరలు



| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 140,149, 160 |
| చికెన్ విత్ స్కిన్ | 270 |
| చికెన్ స్కిన్‌లెస్ | 280 |

**నెక్ కోడిగుడ్డు ధర (100)**

విజయవాడ జోన్ రైతు ధర రూ. 525

## కళాకారులను ప్రోత్సహించాలి

**ఉయ్యూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) :** సంస్కృతి సంప్రదాయాలు, కళలకు నిలయమైన మన సమాజంలో కళాకారులను ప్రోత్సహించడం కళలను గౌరవించడమవు తుందని ఉయ్యూరు మాజీ చైర్మన్ జంపాన పూర్ణచంద్ర రావు అన్నారు. దేవి శరన్నరాత్రి ఉత్సవాల్లో ఉయ్యూరు పరిసర గ్రామాల్లో అమ్మవారిని వివిధ దేవతామూర్తులుగా కొన్ని సంవత్సరాలుగా అలంకరిస్తూ భక్తుల మన్ననలు పొం దిన జగదాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయ అర్చకుడు మామిళ్లపల్లి సోమేశ్వర రావును పూర్ణచంద్రరావు ఘనంగా సత్కరించారు. కళలు అంతరించి పోతున్న తరుణంలో సైతం అమ్మవారి అలంకారాలు చేయడంలో నిష్ణాతు లుగా నిలిచిన సోమేశ్వరరావు అభినందనీయులని కొనియాడారు.



అర్చకుడు సోమేశ్వరరావును సత్కరిస్తున్న ఉయ్యూరు మాజీ చైర్మన్ జంపాన పూర్ణచంద్రరావు

## వాసవీమాత గ్రామోత్సవం



జంక్షన్‌లో నాసిక్ కళాకారుల విచిత్ర ప్రదర్శన

**హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) :** దసరా ఉత్సవాలు ముగింపు సందర్భంగా స్థానిక ఏలూరు రోడ్డులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ఆదివారం రాత్రి ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఆర్యవైశ్య కల్యాణ మండపం నుంచి ప్రారంభించి జంక్షన్ నాలుగు రోడ్లలో అమ్మవారిని రథంపై ఊరేగించారు. ముందుగా దాతల సహకారంతో రూ.7లక్షలు వ్యయంతో నూతనంగా తయారు చేయించిన ఉత్సవ రథంను ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ ప్రారంభించారు. ఆ రథంపై వాసవీ మాతకు అడుగడుగున నీరాజనాలు పలుకుతూ, ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నాసిక్ నుంచి వచ్చిన కళాకారులు ప్రదర్శించిన విచిత్ర విన్యాసాలు ప్రజల్ని ఆకట్టుకున్నాయి. ఆర్యవైశ్య సంఘం మహిళలు కోలాటం ప్రదర్శించారు. కార్యక్రమాన్ని ఆర్యవైశ్య సంఘం నాయకులు తవ్వా పూర్ణచంద్రరావు, కొనకళ్ల రాజశేఖర్, కంభంపాటి శ్రీనివాసరావు, చామర్తి లోక్‌నాథ్, గార్లపాటి రామకృష్ణ, నారికమల్లి ప్రసాద్, ఆర్యవైశ్య మహిళా విభాగం మండల అధ్యక్షురాలు పద్మలలిత తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోనే దేశాభివృద్ధి



జేఎంజే కాలేజీలో విశ్రాంతి మందిరానికి భూమి పూజ నిర్వహిస్తున్న చర్చి ఫాదర్ తంబి

**హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) :** అందరికీ విద్య ఇది మనందరి బాధ్యత అనే నినాదంతో ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులకు అవసరమైన సహకారాన్ని అందించడానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు శ్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచనేని సత్యప్రసాద్ తెలిపారు. సోమవారం స్థానిక గుడివాడ రోడ్డులోని జేఎంజే జూనియర్ మహిళా కళాశాలలో ట్రస్ట్ నిధులు రూ.4లక్షలు అంచనా వ్యయంతో విద్యార్థినులకు అవసరమైన విశ్రాంతి మందిరం నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. జేఎంజే చర్చి ఫాదర్ జోసెఫ్ తంబి ప్రార్థనలు జరిపి శంకుస్థాపన చేశారు. ట్రస్ట్ చైర్మన్ సత్యప్రసాద్, శ్రీదేవి దంపతులను ఫాదర్ తంబి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అంతోనమ్మ, గ్రామ ప్రముఖులు నూలు నరసింహా రావు, ట్రస్ట్ సభ్యులు దయాల ప్రభాకర్, మేడిపూడి రామ్మోహన్ రావు, వీరమాచనేని బుజ్జి, పోతుమర్తి సత్యనారాయణ, నీలం శ్రీధర్, తోకల నాగరాజు, యార్లగడ్డ సత్యనారాయణ, ఉండవల్లి మురళీమోహన్, వడ్లమూడి ఆంజనేయులు, లయన్స్ క్లబ్ నాయకులు అక్కినేని రాఘవేంద్రరావు, శ్రీనివాసరావు కళాశాల అధ్యాపకులు, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

## వీకేఆర్ విద్యార్థులకు మెడికల్ సీట్లు

**గన్నవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) :** స్థానిక వీకేఆర్ కళాశాలలో చదివిన ఇద్దరు విద్యార్థులకు నీట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించటంతో పాటు మెడికల్ కళాశాలలో సీట్లు పొందటం అభినందనీయమని ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ, తమ కళాశాలలో ఇంటర్ బైపీసీ పూర్తి చేసిన జె.రాజ్‌కుమార్ నీట్‌లో 4175 ర్యాంకు పొంది గుంటూరు మెడికల్ కళాశాలలో సీటు సాధించినట్లు తెలిపారు. అలాగే టి.సాయి లోహిత్‌కు 16882 ర్యాంకు రాగా ఆంధ్ర మెడికల్ కళాశాలల్లో వచ్చిందన్నారు. విద్యార్థులు లక్ష్యంతో ముందుకు వెళితే విజయం తథ్యం అన్నారు. అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఉద్యోగుల ఆధ్వర్యంలో వైద్య శిబిరం నేడు

**గన్నవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) :** స్థానిక రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో మంగళ వారం వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు అవుటపల్లి మోహనరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ మ్యాక్సీవిజన్ కంటి ఆస్పత్రి, కృష్ణసాయి దంత వైద్యశాల వైద్యులు వచ్చి పరీక్షలు చేస్తారని రిటైర్డ్ ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## అయ్యప్పలకు అన్నసమారాధన

**హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) :** ఆధ్యాత్మిక చింతనతో క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని అలవరచుకునేదే అయ్యప్ప దీక్ష అని, అటువంటి దీక్షాదారులకు మండల దీక్షాకాలం పాటు నిత్య అన్నసమారాధన చేయడం అభినంద నీయమని తడికమళ్ల ప్రసాద్ గురుస్వామి తెలిపారు. ఎస్.ఎన్.పాలెంలో అడపా యుగంధరరావు గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 10వ సంవత్సర అన్నసమా రాధన కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. నవంబరు 24వ తేదీ వరకు అన్నసమారాధన కార్యక్ర మాన్ని నిర్వహించడం జరుగుతుందని, స్వాములు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు అడపా యుగంధర రావు, దేవులబాబు తెలిపారు. అన్నసమారాధన కార్యక్రమాన్ని అడపా సతీష్, రాంబాబు పర్యవేక్షించారు.



అన్నప్రసాద వితరణ సందర్భంగా ప్రత్యేక పూజలో పాల్గొన్న తడికమళ్ల ప్రసాద్ గురుస్వామి

# పల్లెల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

### ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

**ప్రసాదంపాడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) :** గ్రామ పంచాయతీల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందనిఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. సోమవారం విజయవాడ రూరల్ మండలంలోని అంబాపురం రూ. 35 లక్షలు. .పి.నైనవరం రూ.25 లక్షలు..పాతపాడు రూ.25 లక్షలు, నున్నలో రూ.25 లక్షలు నిధులతో సీసీ రోడ్లకు, దీంతో పాటు రూ.51.90 లక్షల నున్న పంచాయతీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, పల్లెలకు పూర్వ వైభవం తెచ్చేందుకు పల్లె పండుగకు శ్రీకారం చూట్టామన్నారు. గత వైసీపీ పాలనలో గ్రామాల్లో కనీసం బ్లీచింగ్ చల్లేందుకు నిధులు లేకుండా చేశారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధ్యానితనిస్తోందన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గుజ్జర్లపూడి బాబూరావు, పార్టీ మండల అధ్యక్షుడు గొడ్డళ్ల చిన రామారావు, సాగునీటి వినియోగదారుల సమాఖ్య సంఘం అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ, నాయకులు గూడవల్లి నరసయ్య, గండికోట సీతయ్య, భవాని చిన్నపురెడ్డి, కొండేటి వెంకటరత్నం, నాగేశ్వరరావు, బెజవాడ శ్రీను, ధూళిపాళ్ల దేవేందర్‌రావు, నబి, పండు చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.



అంబాపురంలో సీసీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

## సౌర విద్యుత్‌తో డబ్బు ఆదా



సౌర విద్యుత్ ప్యానల్స్‌పై అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న ఉయ్యూరు ఈఈ కృష్ణనాయక్

**ఉయ్యూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) :** గృహ అవసరాలకు సౌర విద్యుత్ ప్యానల్స్ అమర్చుకుని ఆర్థిక ప్రయోజనం పొందవచ్చని ఏపీసీపీడీసీఎల్ డి.కృష్ణనా యక్ అన్నారు. ప్రధాన మంత్రి సూర్య ఘర్ మఫ్తి బిజిలీ యోజన పథకంలో భాగంగా గృహ అవసరాలకు సౌర విద్యుత్ ప్యా నల్స్ అమర్చు కొనుట ద్వారా కలిగే ప్రయోజనాలపై కేసీపీ ఆడిటోరియంలో సోమవారం సబ్‌డివిజన్ పరిధిలో ఉయ్యూరు, తోట్లవల్లూరు మండలాల ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇళ్లపై సోలార్ ప్యానల్స్ అమర్చుకుంటే కరెంటు బిల్లులు తగ్గుతాయన్నారు. ఈ పథకం ద్వారా ప్రభు త్వం నుంచి సబ్సిడీ పొందవచ్చని వివరించారు. ఈ సందర్భంగా ఈ పథకంపై పలువురు సందేహాలు నివృత్తి చేసి రిజిష్ట్రేషన్ ప్రారంభించారు. డిప్యూటీ ఈఈ జి.హేమకుమార్, సబ్‌డివిజన్ పరిధిలో ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

## యువతను ప్రోత్సహించాలి

### ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా చైర్మన్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డి



సతీష్‌రెడ్డిని సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

**ఉంగుటూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) :** సాంకేతిక రంగాల్లో వినూత్న ఆలోచనలతో ముం దుకు వచ్చేలా యువతను ప్రోత్సహించడం ప్రస్తుత కాలంలో అవసరమని ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా(భారత ప్రభుత్వం) చైర్మన్, రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీవో)మాజీ చైర్మన్, డాక్టర్ జి.సతీష్‌రెడ్డి స్పష్టం చేశారు. భారతదేశంలో విద్యావ్యవస్థ పరివర్తనపై తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం నిర్వహించిన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, ప్రపంచ వ్యాప్తంగా వేగం గా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించిందన్నారు. ప్రతిఏటా 1.4 మిలియన్ల ఇంజనీర్లు చదువు పూర్తిచేసుకుని బయటకు వస్తున్నారని, 90శాతం మంది విద్యార్థులకు ప్లేస్‌మెంట్లు లభిస్తున్నాయని చెప్పారు. ఎస్ఐడీఎం కల్నల్ పీఎస్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్, ఆర్అండ్‌డీ, ఇన్నోవేషన్‌సెల్ డీన్ జి.సాగర్ తదితరులు విద్యావ్యవస్థలో చోటుచేసుకున్న పరిణామాలు, ప్రగతి, ఆధునిక సాంకేతికత అంశాలపై వివరించారు. కళాశాల చైర్మన్ సుంకర రామబ్రహ్మం, యూఆర్ సెట్ ఉపాధ్యక్షులు లంకా అరుణ్, ఇతర రాష్ట్ర అధికారులు సతీష్‌రెడ్డిని దుశ్శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు.

## గండిగుంటలో పారిశుధ్యం అధ్వానం!

- వర్షాలకు చెత్త కుళ్లి వెలువడుతున్న దుర్గంధం
- రోగాల బారిన గ్రామస్థులు
- పట్టించుకోని పంచాయతీ పాలకులు, అధికారులు



గండిగుంట సర్వీసు రోడ్డుపక్కన పేరుకుపోయిన చెత్తకుప్ప

**ఉయ్యూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) :** రోడ్లపక్కన పేరుకుపోయిన చెత్తకుప్పలు, వర్షాలకు కుళ్లి వెలువడుతున్న దుర్గంధంతో గండిగుటం పంచాయతీ పరిధిలో పారిశుధ్యం అధ్వాన స్థితికి చేరుకోవడంతో గ్రామస్థులు రోగాల బారిన పడుతున్నారు. గ్రామంలో ప్రధాన రహదారితో పాటు ప్లైఓవర్ పక్కన ఉన్న సర్వీ సు రోడ్డు, కాకాని నగర్ రోడ్డు వెంబడి రోజుల తరబడి చెత్తకుప్ప లు తొలగించక పోవడంతో పేరుకుపోయి వర్షాలకు కుళ్లి దుర్గంధం వ్యాపించడంతో పాటు ఈగలు, దోమలు వాలుతున్నాయి. దీంతో ప్రజలు రోడ్డుపై ముక్కుమూసుకుని వెళ్లే పరిస్థితి నెలకొంది. కాటూరు రోడ్డులో మార్కెట్ యార్డు వద్ద ఆర్డీవో, తహసీల్దార్ కార్యాల యాలకు వెళ్లే గేట్ల సమీ పాన చెత్తకుప్పలు పేరుకుపోయాయి. పంచాయతీ ఉద్యోగులు, సిబ్బంది పట్టించుకోపోవడంతో గ్రామంలో చెత్తకుప్పలు పేరుకుపోయిపారిశుధ్యం రోజు రోజుకు అధ్వానంగా తయారవుతుందని గ్రామప్రజలు ఆందోళన చెందుతున్నారు.

## స్నేహితుడి కోసం వచ్చి మృత్యువు ఒడిలోకి..

### రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

**గన్నవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) :** స్నేహితుడి దగ్గరకు వచ్చి తిరిగి వెళుతుండగా జరిగిన ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎనికేపాడుకు చెందిన నందమూరి లీలా కృష్ణ(35) కొత్త ఆటో నగర్‌లో వెల్డర్‌గా పని చేస్తుంటాడు. అతనికి భార్య, బాబు, పాప ఉన్నారు. ఆదివారం స్నేహితుడిని కలిసేం దుకు మండలంలోని ముస్తాబాద వచ్చాడు. మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో తిరిగి ద్విచక్ర వాహనం పై వెళుతుండగా పేద చెరువు దాటగానే బైకు స్కిడ్ అయి పడిపోయాడు. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయాలు అయ్యాయి. స్థానికులు విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. గన్నవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కంకిపాడు జడ్పీ పాఠశాల విద్యార్థులు

**కంకిపాడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) :** కంకిపాడు జడ్పీ పాఠశాల 1999 - 2000 పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం స్థానిక రాయల్ ఏసీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో మలబంటి వెంకటేశ్వరరావు, మోతుకూరి నాగవేణు, తంబాబత్తుల రమేష్, గుడివాడ సుబ్బారావు, రఫీ, శనగల బాల, శనగపల్లి సురేష్‌లు విశేషంగా కృషి చేశారంటూ అభినందించారు.

## ఆగి ఉన్న కారును ఢీకొన్న బైక్

- ఇద్దరికి తీవ్ర గాయాలు

**హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) :** రోడ్డు ప్రక్కన నిలిపి టైరు మారుస్తున్న కారును వెనుక నుంచి ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో ఇద్దరు తీవ్ర గాయాల పాలైన ఘటన వీరవల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. వీరవల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విజయవాడ వైపునకు వెళుతున్న కారు షుగర్ ఫ్యాక్టరీ ఎదురుగా జాతీయరహదారిపై టైరు పంక్చర్ కావడంతో రహదారి ప్రక్కన ఆపి టైరు మారుస్తున్నారని, ఆదే సమయంలో ఇబ్రహీంపట్నం వెళుతున్న సత్యం అనే వ్యక్తి బైక్ అతివేగంగా నడపడంతో ఆగి ఉన్న కారును వెనుకవైపు బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న జంగారెడ్డిగూడెంకు చెందిన కోదండపాటి నాగ వెంకట సత్యంకు తీవ్రగాయాలవడంతో పాటు కారులో ప్రయాణిస్తున్న మహిళలు చిన్నపాటి గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న వీరవల్లి ఏఎస్సై వై. వి. ఆంజనేయులు గాయాలపాలైన సత్యంను అంబులెన్స్‌లో ఏలూరు ఆసుపత్రికి తరలించారు.

## వరద ముంపు బాధితులందరికీ నష్టపరిహారం అందజేయాలి: సీపీఎం

**ఉంగుటూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) :** భారీ వర్షాల కారణంగా గతనెలలో సంభవించిన బుడమేరు వరదలకు ఇళ్లు పూర్తిగా నీటమునిగి ప్రభుత్వం నుంచి ఇంకా నష్టపరిహారం, నిత్యావసర సరుకుల కిట్లు అందని వరద బాధితులకు వెంటనే నష్టపరిహారం, సరుకులు అందించాలని సీపీఎం మండల నేతల ఆధ్వర్యంలో సోమవారం మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆయా గ్రామాల వరద బాధితులతో కలిసి ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ జాలాది విమలకుమారిని కలిసి సామూహిక రాయబారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టీవీ లక్ష్మణస్వామి మాట్లాడుతూ, వరదలవల్ల లంకపల్లి, ఓంద్రంపాడు, ముక్కపాడు, వెల్దిపాడు, కొయ్యగూరపాడు, ఆముదాలపల్లి, ఎలుకపాడు గ్రామాల్లో ప్రభుత్వ నష్టపరిహారం కొంతమందికే అందిందని, మిగిలిన బాధితులకు కూడా నష్టపరిహారాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి అజ్మీర్ వెంకటేశ్వరరావు, నాయకులు విష్ణుప్రసాద్, జయరాజు, మేరీకుమారి, ఇమ్మానియేల్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

### లంకపల్లిలో డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుపరచాలి

మండలంలోని లంకపల్లిలో అధ్వానంగా వున్న డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలని సీపీఎం నాయకులు, గ్రామస్థులు సోమవారం ఎంపీడీవో ఈ.సత్యకుమార్‌ని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు కొండా నాగరాజు, కళ్లం జయరాజు, గుండే కుమారిమేరీ, గుండే ప్రసాదు, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీవో సత్యకుమార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న సీపీఎం నేతలు



డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను సత్కరిస్తున్న తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి

## డిప్యూటీ సీఎంకు ఘన సత్కారం

**కంకిపాడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) :** రాష్ట్రాభివృద్ధికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేస్తున్న కృషి అభినందనీ యమని తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి అన్నారు. పల్లె పండుగ..పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా చేపట్టిన పలు అభివృద్ధి పనులను సోమవారం ఆయన కంకిపాడులో ప్రారంభించారు. ఈ కార్యక్రమాలకు హాజరైన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను దండమూడి చౌదరి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా దండమూడి చౌదరి మాట్లాడుతూ, దేశంలో ఎక్కడే లేని విధంగా ఒకే సారి సుమారు 12 వేల పంచాయతీల్లో గ్రామసభలు నిర్వ హించి 30 వేల పనులకు రూ. 4500 కోట్లు కేటాయించటం హర్షణీయమన్నారు.

**బ్రాయిలర్ ధరలు**



| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 140,149,160 |
| చికెన్ విత్ స్కిన్ | 270 |
| చికెన్ స్కిన్‌లెస్ | 280 |

**నెక్ కోడిగుడ్డు ధర (100)**

విజయవాడ జోన్ రైతు ధర రూ. 525

## పల్లెల అభివృద్ధే ధ్యేయం : ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

**కూచిపూడి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) :** రహదారుల నిర్మాణంతో పల్లె సీమల రూపు రేఖలు మారిపోనున్నాయని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. పల్లె పండుగలో భాగంగా కాజలో సీసీ రహదారుల నిర్మాణ శిలాఫలకాన్ని ఎమ్మెల్యే, కూటమి నేతలు, అధికారులతో కలిసి ఆవిష్కరించారు. పామర్రు నియోజకవర్గంలో రూ.26 కోట్లతో 416 రహదారులు నిర్మించనున్నామన్నారు. మొవ్వ మండలంలో ఐదు కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. పల్లెల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. లింగమనేని రామలింగేశ్వరరావు, యార్లగడ్డ శ్రీనివాసరావు, తాతా నారాయణరావు, యార్లగడ్డ చందు, ఎంపీడీవో విమాదేవి, సర్పంచ్ కొడాలి భవాని, పంచాయతీ రాజ్ ఏఈ వాసుదేవ రావు తదితరులు పాల్గొన్నారు.



కాజలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

# ఓట్ల ఆటలో ప్రజలు బలి!

- మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని కుయుక్తులతో ఎన్నికలకు నోచుకోని గుడ్లవల్లేరు, కూరాడ, కౌతవరం పంచాయతీలు
- విలీనం పేరుతో అభివృద్ధి శూన్యం
- ప్రజాపాలన లేక లబోదిబోమంటున్న ఆయా గ్రామాల ప్రజలు

**(ఆంధ్రజ్యోతి గుడ్లవల్లేరు)**

జగన్ ఆడిన మూడు రాజధానులు అనే మూడు ముక్కలాటలో రాష్ట్రం సర్వనాశనం అయ్యింది. ఆయన అనుచరుడు కొడాలి శ్రీవెంకటేశ్వరావు(నాని) ఆడించిన పంచాయతీల్లో వార్డుల విలీనం లోనా బయట ఆటలో మూడు గ్రామ పంచాయతీలు అభివృద్ధికి నోచుకోకుండా పోయాయని ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. గుడివాడ మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని ఎన్నికల పాచికలకు గుడ్లవల్లేరు, కూరాడ, కౌతవరం గ్రామ పంచాయతీలు బలయ్యాయని ఆయా గ్రామాల ప్రజలు బాహాటంగానే చెప్పుకొంటున్నారు.

మండలంలో అన్ని గ్రామ పంచాయితీలకూ 2021లో ఎన్నికలు జరిపితే గుడ్లవల్లేరు, కూరాడ, కౌతవరం గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిలిపి వేశారు. కారణం కౌతవరం ఒకటి, రెండు వార్డులను, కూరాడలోని 7, 8, 9 వార్డులను గుడ్లవల్లేరు పంచాయతీలో విలీనం చేస్తామన్న ప్రతిపాదనలు సాకుగా చూపి ఎన్నికలు నిలిపి వేశారు. వార్డుల విలీనాన్ని నిలిపి వేయాలని కూరాడకు చెందిన కొందరు కోర్టుకు వెళ్లారనే అవాస్తవాలను కొడాలి నాని తన మనుషుల ద్వారా ప్రచారం చేయించి ప్రజలను ఏమార్చారు. అసలు విషయం ఈ మూడు పంచాయతీల్లో టీడీపీ బలంగా ఉండటంతో ఎన్నికలకు వెళితే మూడు పంచాయతీలను వైసీపీ కోల్పోవాల్సి వస్తుందని, ఆనాడు తాను మంత్రిగా ఉన్న తన ప్రతిష్ఠకు భంగం వాటిల్లుతుందనే ఆలోచనతోనే నాని సమస్యను సృష్టించాడని నాయకులకు తెలిసొచ్చింది. దీని వల్ల మూడు ఆ గ్రామాలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రాకపోవడంతో అభివృద్ధి కుంటుపడింది.

### కోర్టును ఆశ్రయించిన దాఖలాలు లేవు

ఈ మూడు పంచాయతీల్లో ఈ ప్రక్రియను ఆపమని కోర్టులో పిటిషన్ వేసిన దాఖలాలు లేవు. కోర్టులో వేసి ఉంటే పంచాయితీ రాజ్ శాఖ, పంచాయతీలను కోర్టు వివరణ కోరి ఉండేది. అది జరగలేదన్న విషయం బయటకొచ్చింది. మూడు పంచాయతీల అప్పటి, ఇప్పటి కార్యదర్శులను విలీనం ప్రక్రియపై కోర్టులో కేసు ఉందా? కోర్టు నోటీసులు, వివరణ ఇవ్వాలన్న ఆదేశాలు వచ్చాయా అని ప్రశ్నించగా ఏమీ లేవని వారు చెప్పారు.

### గ్రామసభల్లో ఏకపక్షంగా తీర్మానాలు ..

వార్డుల విలీనం ప్రక్రియకు ముందుగా మంత్రి హోదాలో ఉన్న నాని అప్పటి కలెక్టరు ద్వారా పంచాయతీ కార్యదర్శులకు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి వార్డుల విలీనం ప్రక్రియ ప్రతిపాదనలు పంపాలని ఆదేశాలు ఇప్పించారు. జనవరి, 2020 లో ఆ మూడు గ్రామాల పంచాయతీలలో గ్రామ సభలు నిర్వహించి మీ గ్రామాలకు దూరంగా ఉంటున్న ఈ వార్డులు గుడ్లవల్లేరుకు సరిహద్దుల్లో గ్రామంలో కలసి పోయి ఉంటాయనీ, అక్కడ అయితేనే అభివృద్ధి జరుగుతుందని కౌతవరం, కూరాడ గ్రామసభల్లో అధికారులతో, అప్పటి అధికార పార్టీ నాయకులచే చెప్పించారు. అప్పటికీ కూరాడ, కౌతవరం గ్రామల్లో ఆ ప్రాంత ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేసినా, వాటిని బేఖాతరు చేస్తూ అధికారులతో బలవంతంగానే ఏకపక్షంగానే విలీన తీర్మానాలు చేయించేశారని వినపడుతోంది.









గుడ్లవల్లేరు పంచాయతీ కార్యాలయం.. మూడు గ్రామాల మ్యాప్..

### పంచాయతీరాజ్ కమిషనర్‌కు ప్రతిపాదన చేసి..

గ్రామసభ తీర్మానాలను చూపుతూ రెండు పంచాయతీల వార్డులు గుడ్లవల్లేరులో విలీనం చేసేందుకు పంచాయతీ రాజ్ కమిషనర్‌కు 2020 జనవరి, ఫిబ్రవరి మధ్య ప్రతిపాదనలు పంపారు. తరువాత దాన్ని కొనసాగింపు చర్యలు మాత్రం చేయకుండా కావాలనే వదిలేశారు. దానితో అధికారులు ఆ ప్రక్రియను పెండింగ్ పెట్టేశారు. 2021లో పంచాయతీల ఎన్నికలు వచ్చేసాయి. ఈ మూడు పంచాయతీలలో వార్డుల విలీనం ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయి వీటికి ఎన్నికలు జరుపవద్దని పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులతో ఎన్నికల కమిషనర్‌కి బలంగా చెప్పించి ఈ మూడు గ్రామాలకు ఎన్నికలు జరగకుండా నిలిపివేశారు.

## తాగునీటి సమస్య పరిష్కరిస్తా

**ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్**



గుడివాడలో తాగు నీటి పరిస్థితిని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు వివరిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

**గుడివాడ, అక్టోబరు 14 : (ఆంధ్రజ్యోతి) :** గుడివాడ నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశించారని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. సోమవారం కంకిపాడులో జరిగిన రాష్ట్రస్థాయి పల్లెపండుగ కార్యక్రమానికి విచ్చేసిన ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను కలిసి రక్షిత మంచినీటి పథకాల ద్వారా సరఫరా అవుతున్న తాగునీటిని ఆయనకు చూపించామన్నారు. నియోజకవర్గంలోని 43 గ్రామాల్లోని తాగునీటి పరిస్థితిని ఆయనకు వివరించామన్నారు. తక్షణమే స్పందించిన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నీటి నాణ్యతను పరిశీలించి సమస్యను త్వరితగతిన పరిష్కారించాలని గ్రామీణ నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారన్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

### అభివృద్ధికి నిధుల కేటాయింపు..



ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను కలిసిన ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

**పామర్రు :** అడిగిన వెంటేనే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పామర్రు నియోజకవర్గం అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం హర్షణీయమని ఎమ్మె ల్యే వర్లకుమార్ రాజా అన్నారు. కంకిపాడులో సోమవారం జరిగిన పల్లె పండుగ ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కలిసి గత పాలకుల హయాంలో నిర్లక్ష్యానికి గురైన పామర్రు నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులను మంజూరు చేయాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. నియోజకవర్గంలో 398 నూతన సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.24 కోట్లను ఆయన మంజూరు చేశారన్నారు. కంకిపాడు- రొయ్యూరు రహదారి అభివృద్ధికి నిధులు ప్రకటించారని, తోట్లవల్లూరు మండలం ప్రజల చిరకాల వాంఛ పాములంక వంతెన నిర్మాణం సవరించిన ప్రతిప్రతిపాదనలు సిద్ధం కాగానే నిర్మాణం ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు.



గుడ్లవల్లేరు గంగాపార్వతీ సమేత సిద్దేశ్వరస్వామి వార్ల నూతన పంచలోహ ఉత్సవమూర్తులు

## నూతన విగ్రహాల పునఃప్రతిష్ఠ

**గుడ్లవల్లేరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) :** గుడ్లవల్లేరు సిద్ధేశ్వరస్వామి దేవస్థాన నూతన ఉత్సవ విగ్రహాల సంప్రోక్షణ, ధ్వజ, శిఖర పునఃప్రతిష్ఠ సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 8.02 గంటలకు ధ్వజ, శిఖర పునఃప్రతిష్ఠ శాస్త్రోక్తంగా వేదపండితుల మంత్రోచ్చరణ నడుమ నిర్వహించారు. సిద్ధేశ్వరస్వామి పార్వతీ దేవి ఉత్సవ విగ్రహాల సంప్రోక్షణ నిర్వహించి, మహాపూర్ణాహుతి గావించారు. అనంతరం 1500 మందికి అన్నసమారాధన జరిపారు. మధ్యాహ్నం గంగా పార్వతీ సమేత సిద్ధేశ్వరస్వామి పంచలోహ విగ్రహాలను గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఆలయ నిర్వాహకులు కొసరాజు వెంకట్రాద్రి (పెదబాబు), అన్నే ప్రసాదరావు, వల్లూరుపల్లి వెంకటేశ్వరరావు, మిక్కిలినేని కృష్ణ, కోగంటి రాధాకృష్ణ, అడుసుమిల్లి వీరభద్రరావు, వల్లభనేని రంగబాబు, అడుసుమిల్లి భూపతి పాల్గొన్నారు.

## మర్యాదపూర్వక కలయిక



కమిషనర్‌ను కలిసిన మున్సిపల్ దుకాణాల అసోసియేషన్ సభ్యులు

**గుడివాడ, అక్టోబరు 14 : (ఆంధ్రజ్యోతి) :** గుడివాడ పురపాలక సంఘం కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన బి.శ్రీనివాసరావును సోమవారం మున్సిపల్ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో మున్సిపల్ దుకాణాల అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. అసోసియేషన్ అధ్యక్షులు కె.డి.వి.ఎన్ శ్రీనివాస్, సభ్యులు కొత్త సుబ్బారావు, సయ్యద్ గఫార్ పాల్గొన్నారు.

## ఘనంగా అమ్మవారి ఊరేగింపు



పూజ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు

గుడివాడ తొమ్మిదో వార్డులను కనకదుర్గమ్మ దేవస్థానంలోని అమ్మవారిని సోమవారం ఘనంగా ఊరేగించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు జరిపారు. దేవస్థాన కమిటీ సభ్యులు పొగిరి రమణ, గెదేల సన్యాసిరావు, వల్లూరు పారమనాయుడు, వల్లూరు గణపతి, ఇందిర, సింహాద్రి కృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు చల్లపల్లి విద్యార్థిని ఏక్తాప్రియ

**చల్లపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) :** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో రామానగరం శ్రీచైతన్య స్కూల్ విద్యార్థిని గూడపాటి ఏక్తాప్రియ బంగారు పతకం సాధించింది. తిరుపతిలో మూడు రోజులపాటు జరిగిన పోటీల్లో ఆరో తరగతి విద్యార్థిని ఏక్తాప్రియ అండర్ - 14 (18 - 20 కిలోలు) విభాగంలో బంగారు పతకం సాధించి జాతీయ స్థాయికి ఎంపికైంది. విద్యార్థిని ఏక్తా ప్రియను ప్రిన్సిపాల్ డి.సురేష్ అభినందించారు.

## సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ



సీసీ రోడ్లకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు

**గుడివాడ రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) :** రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక చొరవతో గుడివాడ నియోజకవర్గంలోని తాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మండలంలోని గుంటా కోడూరు, మోటూరు, వలివర్తిపాడు గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా గుంటాకోడూరులో సీసీ రోడ్లకు వెనిగండ్ల, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు భూమి పూజ చేశారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని అభివృద్ధి చేయకుండా గ్రామాలను ధ్వంసం చేశారని విమర్శించారు. రహదారులు, డ్రైనేజీ వ్యవస్థను పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్ద పీట వేస్తుందన్నారు. నియోజకవర్గ జనసేన పార్టీ అధ్యక్షుడు బూరగడ్డ శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రజలకు తమ ప్రభుత్వం దగ్గరగా ఉండి గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు వాసే మురళీ, గుంటా కోడూరు, మోటూరు సర్పంచ్‌లు అంగడాల భారతి, కె.పద్మ, ఎంపీపీ గద్దె పుష్పరాణి, ఎంపీడీవో డి.వై.విష్ణుప్రసాద్, టీడీపీ నాయకులు గోర్జి సత్యనారాయణ, అంగడాల వీర్రాజు, నారెడ్డి సుబ్రహ్మణ్యం, కోటే శేఖర్, బండి రాజు, మొవ్వ సంజయ్, రేమల్లి రజనీకాంత్, డొక్కుమాల శ్రీకాంత్, పంచకర్ల తాతాజీ, దొండపాటి మహేష్, డొక్కు మాల ఆనంద్, తోకల క్రాంతి, చీకటి శేషగిరిరావు, గంటా బాలాజీ, గొర్రె రంగ, శలంకాయల జనార్దనరావు, సాయి, పసర్లపూడి లక్ష్మి, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## ముడుపులిస్తేనే రెవెన్యూ పనులు

- మోపిదేవి మండల సమావేశంలో ప్రజాప్రతినిధుల ఆగ్రహం



రెవెన్యూ శాఖ అధికారులను ప్రశ్నిస్తున్న సర్పంచ్ పోలిమెట్ల ఏసుబాబు

**మోపిదేవి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) :** ముడుపులు చెల్లిస్తేనే రెవెన్యూ ఉద్యోగులు పనులు చేస్తున్నారని ప్రజాప్రతినిధులు ఆగ్ర హం వ్యక్తం చేశారు. మోపిదేవి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ రావి దుర్గావాణి అధ్యక్షతన జరిగింది. ఆయా శాఖల వారీగా ఎంపీపీ సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వం నిర్వహించిన రీ సర్వేలో రెవెన్యూ ఉద్యోగులు రైతులకు కనీస సమాచారం లేకుండా భూముల కొలతలు నిర్వహించి ఇష్టానుసారంగా రాళ్లు పాతి రికార్డులు తారుమారు చేశారని ప్రజాప్రతినిధులు తెలిపారు. అండగల్, ఆర్‌వోఆర్‌లో రైతులు భూముల కొలతలు సక్రమంగా లేవన్నారు. ప్రతి పనికి రేటు నిర్ణయించి మొ త్తం చెల్లిస్తేనే పనులు చేస్తున్నారని ఎంపీటీసీ సభ్యులు ఆరోపించారు. ఇప్పటికైనా రెవెన్యూ ఉద్యోగులు రికార్డులు సరి చేసి రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. మండలంలో నాడు - నేడు పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయని, సంబంధిత శాఖాధికారులు సమావేశాలకు ఎందుకు రావటం లేదని ప్రజా ప్రతినిధులు నిలదీశారు. డ్రైనేజీ, ఆర్ అండ్ బీ ఉద్యోగులు సమావేశాలకు రాకపోవటంపై సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులే సమావేశాలకు రానప్పుడు సమావేశాలు నిర్వహిం చటం ఎందుకంటూ అసహనం వ్యక్తం చేశారు. పల్లె పండుగ కార్యక్రమంలో నిధులు కేటాయించిన గ్రామాల్లో అభివృద్ధి పనులను విజయవంతం చేయాలని పంచాయతీరాజ్ ఏఈ బొప్పన శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం కేటాయించిన నిధులతో పనులు త్వరగా పూర్తి చేస్తే వెంటనే రెండో విడత నిధులు మంజూరవుతాయని తెలిపారు. కొక్కిలిగడ్డ, బొబ్బర్లంక గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని మూడు సంవత్సరాలుగా కోరుతున్నా కరుణ చూపడం లేదని సర్పంచ్ దిడ్ల జానకి రాంబాబు, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు చందన రంగారావు ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపీడీవో జె.స్వర్ణభారతి, వైస్ ఎంపీపీలు జనసీ కుమారి, కడవకొల్లు సీతారామాంజనేయులు, జడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లికార్జునరావు ఆయా శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.



విన్నకోటలో పాడి రైతును సన్మానిస్తున్న చలసాని ఆంజనేయులు

## పాడిరైతు సంక్షేమానికి కృషి

**కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు**

**గుడ్లవల్లేరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) :** ప్రతి పాడిరైతు కుటుంబం ఆర్థికంగా బలపడేందుకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రోత్సాహాన్ని అందిస్తున్నామని కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. విన్నకోట, శేరిదగ్గుమిల్లి, అంగలూరు పాలుత్పత్తిదారుల సహకార సంఘాలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాలు పోసే రైతులకు ధర వ్యత్యాసం, కల్యాణమస్తు, క్షీరబంధు, ప్రతిభ, ప్రమాద బీమా పథకాలను అమలు చేస్తున్నట్లు ఆయన వివరించారు. యూనియన్ జిల్లా డైరెక్టరు వల్లభనేని భాస్కర పూర్ణ కుటుంబ వెంకట సుబ్బారావు, గుడ్లవల్లేరు పాలశీతల కేంద్రం మేనేజరు తోట సత్యనారాయణ, కాశేశ్వరమ్మ, సాయిన హరిప్రసాద్, పాలపర్తి నరసింహారావు, సూపర్‌వైజర్ గోరంట్ల గోపిరాజు తదితరులు పాల్గొన్నారు.

## రూ.1.40 కోట్లతో రోడ్ల నిర్మాణం



తుమ్మలపల్లిలో రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు

**నందివాడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) :** నందివాడ, తుమ్మలపల్లి, కుదరవల్లి, లక్ష్మీనరసింహాపురం గ్రామాల్లో సోమవారం గుడివాడ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రావి మాట్లాడుతూ పల్లె పండుగ కార్యక్రమాల్లో భాగంగా మొదటి రోజు 1.40 కోట్లతో శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించటం జరిగిందన్నారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నందివాడ మండలంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నట్లు తెలిపారు. వెనిగండ్ల రామకృష్ణ (నాని), మండల టీడీపీ అధ్యక్షులు దానేటి సన్యాసిరావు, కార్యదర్శి నంబూరి రాకేష్, సురేంద్ర బాబు, గొర్జి సత్యనారాయణ, పెయ్యేల ఆదాం, ఎంపిడివో మల్లేశ్వరి, తహసీల్దార్ రఘురాం రెడ్డి, పంచాయతీ రాజ్ డీఈ రవికుమార్, ఎఫ్‌డీవో రవికుమార్, టీడీపీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

### కుచికాయలపూడి, పోలిమెట్టలో..

**గుడ్లవల్లేరు :** పల్లెపండుగ కార్యక్రమం మంగళవారం మండలంలోని కుచి కాయలపూడి, పోలిమెట్ట, శేరికల్వపూడి గ్రామాల్లో జరుగనుంది. ఈ గ్రామా ల్లో ఉపాధి హామి పథకం రూ64.13 లక్షలతో తొమిమ్మది పనులు చేపట్టనున్నారు. కుచికాయలపూడి గ్రామంలో రెండు రోడ్లకు రూ.18. 75 లక్షలు, పోలిమెట్ల గ్రామంలో రెండు రోడ్లకు రూ.19.13 లక్షలు, శేరికల్వపూడిలో ఐదు రోడ్లకు రూ.26.25 లక్షలు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు మంజూరు అయ్యాయి.

## రూ.71 కోట్లతో అభివృద్ధి పనులు

- మంత్రి కొల్లు రవీంద్ర

**మచిలీపట్నం టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) :** మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలో రూ.71 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఆర్ అండ్ బి అతిథి గృహంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించిన అనంతరం సోమవారం రాత్రి మీడియాతో మాట్లాడారు. ఆర్ అండ్ బి శాఖ కింద నియోజకవర్గంలో శిథిల రోడ్ల పనులు చేపడుతున్నామన్నారు. 15వ ఆర్థిక సంఘ నిధులతో వివిధ గ్రామాల్లో రోడ్లు, శ్మశానాలు, ప్రహరీ అభివృద్ధి పనులు చేపడతామన్నారు. వీటితో పాటు రూ. 20 కోట్లు మైనింగ్ గ్రాంటు తీసుకువచ్చామని, ఈ నిధులతో చేపట్టబోయే పనులకు ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. మోడల్ నియోజకవర్గంగా చేయడమే లక్ష్యంగా వివిధ శాఖలను సమన్వయం చేస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

జిల్లాలో పల్లెపండుగకు కేటాయించిన నిధులు, అభివృద్ధి పనులపై సోమవారం రాత్రి రోడ్లు మంత్రి కొల్లు రవీంద్ర అధికారులతో సమీక్షించారు.

# రాజుపేట రైతుబజార్ దైన్యం



రాజుపేటలో రైతుబజార్ (ఇన్‌సెట్లో వెలవెలబోతున్న కూరగాయల షాపు)

- వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో అడుగుపడని అభివృద్ధి
- 22 షాపుల్లో అమ్మకాలు ఏడు దుకాణాల్లోనే..
- వనరులు లేక ముందుకు రాని రైతులు

గతంలో కొల్లు రవీంద్ర మంత్రిగా ఉన్న సమయంలో రైతులు, వినియోగదారులకు ఎంతో మేలు చేకూరుతుందనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన రాజుపేట రైతుబజారు అభివృద్ధికి నోచుకోలేదు. వైసీపీ ప్రభుత్వం ఈ రైతుబజారును పూర్తిగా పట్టించుకోలేదు. కేవలం ఏడు షాపుల్లో మాత్రమే కూరగాయలు అమ్ముతున్నారు. మిగిలినషాపులు నిరుపయోగంగా పడిఉన్నాయి.

**(ఆంధ్రజ్యోతి - మచిలీపట్నం టౌన్)**

ప్రధాన రైతుబజారు మీద ఎక్కువ ఒత్తిడి ఉండటం వల్ల గొడుగుపేట నుంచి శారదానగర్ వరకు ఉండే 20 డివిజన్ల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా రైతుబజార్‌ను రూపొందించారు. రాజుపేట రైతుబజార్ నిర్మాణానికి రూ. 50 లక్షలు కేటాయించారు. 22 షాపులు నిర్మించారు. మరుగుదొడ్లు నిర్మించారు. తాగునీటి సౌకర్యం లేకుండా పోయింది. మరుగుదొడ్లు నిర్మించినప్పటికీ ఉపయోగానికి నోచుకోవడం లేదు. ప్రహరీ లేదు. మచిలీపట్నం దక్షిణ ప్రాంత గ్రామాల్లో కూరగాయలు పండించే రైతులతో పాటు దివిసీమ రైతులు కూడా రాజుపేట రైతుబజారులో కూరగాయలు అమ్ముకునే అవకాశాలు ఉన్నాయి. రైతులకు తగిన ప్రోత్సాహకాలు కల్పించకపోవడంతో రైతుబజారు అభివృద్ధికి నోచుకోవడం లేదు. నామమాత్రంగా నడుస్తున్న రాజుపేట రైతుబజారు అభివృద్ధిపై దృష్టి సారించాలని నగర ప్రజలు కోరుతున్నారు. ప్రహరీ లేకపోవడం వల్ల రాత్రిపూట అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినబడుతున్నాయి. ఇటీవల రాజుపేట రైతుబజారును కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము తదితరులు సందర్శించారు. సమస్యను మంత్రి కొల్లు రవీంద్ర దృష్టిలోకి తీసుకుని వెళ్లారు.

### సదుపాయాలు కల్పించాలి



రైతుబజారులో సరైన వనరులు లేవు. నేను పండించిన కూరగాయలు ఇక్కడకు తీసుకువస్తున్నా.. అన్నీ అమ్ముకోలేకపోతున్నాం. చాలా మంది వినియోగదారులకు రాజుపేటలో రైతుబజారు ఉన్న సంగతే తెలియదు. మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకురావాలి. తాగునీటి వసతి సౌకర్యం కల్పించాలి.

**-ప్రసాద్, రైతు, మేకావారిపాలెం**

### రైతుబజారును అభివృద్ధి చేయాలి



రాజుపేట రైతుబజారును అభివృద్ధి చేయాలి. వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురావాలి. చాలా షాపులు ఖాళీగా ఉన్నాయి. రైతులకు కావలసిన వనరులు కల్పించాలి. బియ్యం, కందిపప్పు, పామాయిల్ సరసమైన ధరలకు విక్రయించేలా చర్యలు తీసుకోవాలి.

**- ఫిరోజ్, వినియోగదారుడు**

### ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా

రాజుపేట రైతుబజారు సమస్యలను ఉన్నతాధికారులకు తెలియచేశాం. అభివృద్ధికి కావలసిన నిధులను కోరాం. చుట్టూ ప్రహరీ నిర్మించాల్సి ఉంది. ఖాళీగా ఉన్న షాపులను రైతులకు ఇచ్చేందుకు సుముఖంగానే ఉన్నాం. ఆశించినంతగా రైతులు ముందుకు రావడం లేదు. ఈ సమస్యను మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి తీసుకువెళ్లాం. రైతులతో సమావేశం ఏర్పాటు చేస్తాం.

**- అమీర్‌బాబు, ఎస్టేట్ ఆఫీసర్**



పాడుపడిపోతున్న మరుగుదొడ్లు



రెవెన్యూ అధికారులను ప్రశ్నిస్తున్న సర్పంచ్ పోలిమెట్ల ఏసుబాబు

# ముడుపులిస్తేనే రెవెన్యూ పనులు

- మోపిదేవి మండల సమావేశంలో ప్రజాప్రతినిధుల ఆగ్రహం

**మోపిదేవి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి)**: ముడుపులు చెల్లిస్తేనే రెవెన్యూ ఉద్యోగులు పనులు చేస్తున్నారని ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మోపిదేవి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ రావి దుర్గావాణి అధ్యక్షతన జరిగింది. ఆయా శాఖల వారీగా ఎంపీపీ సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వం నిర్వహించిన రీ సర్వేలో రెవెన్యూ ఉద్యోగులు రైతులకు కనీస సమాచారం లేకుండా భూముల కొలతలు నిర్వహించి ఇష్టానుసారంగా రాళ్లు పాతి రికార్డులు తారుమారు చేశారని ప్రజాప్రతినిధులు తెలిపారు. అండగల్, ఆర్‌వోఆర్‌లో రైతులు భూముల కొలతలు సక్రమంగా లేవన్నారు. ప్రతి పనికి రేటు నిర్ణయించి మొత్తం చెల్లిస్తేనే పనులు చేస్తున్నారని ఎంపీటీసీ సభ్యులు ఆరోపించారు. ఇప్పటికైనా రెవెన్యూ ఉద్యోగులు రికార్డులు సరి చేసి రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. మండలంలో నాడు - నేడు పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయని, సంబంధిత శాఖాధికారులు సమావేశాలకు ఎందుకు రావటం లేదని ప్రజా ప్రతినిధులు నిలదీశారు. డ్రెనేజీ, ఆర్ అండ్ బీ ఉద్యోగులు సమావేశాలకు రాకపోవటంపై సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులే సమావేశాలకు రానప్పుడు సమావేశాలు నిర్వహిం చటం ఎందుకంటూ అసహనం వ్యక్తం చేశారు. పల్లె పండుగ కార్యక్రమంలో నిధులు కేటాయించిన గ్రామాల్లో అభివృద్ధి పనులను విజయవంతం చేయాలని పంచాయతీరాజ్ ఏఈ బొప్పన శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం కేటాయించిన నిధులతో పనులు త్వరగా పూర్తి చేస్తే వెంటనే రెండో విడత నిధులు మంజూరవుతాయని తెలిపారు. కొక్కిలిగడ్డ, బొబ్బర్లంక గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని మూడు సంవత్సరాలుగా కోరుతున్నా కరుణ చూపడం లేదని సర్పంచ్ దిడ్ల జానకి రాంబాబు, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు చందన రంగారావు ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపీడీవో జె.స్వర్ణభారతి, వైస్ ఎంపీపీలు జనసీ కుమారి, కడవకొల్లు సీతారామాంజనేయులు, జడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లిఖార్జున రావు ఆయా శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

# బందరులో భారీ వర్షం

**మచిలీపట్నం టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి)** అల్పపీడన ప్రభావం వల్ల జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భారీ వర్షం కురిసింది. ప్రధాన వీధులు జలమయమయ్యాయి. కోనేరుసెంటర్, రేవతి సెంటర్, లక్ష్మీ టాకీసు సెంటర్‌లు ముంపుకు గురయ్యాయి. లోతట్టు ప్రాంతాలు ముంపుకు గురయ్యాయి. సుందరయ్యనగర్, ఆదర్శనగర్‌లు ముంపుకు గురయ్యాయి. ఈ వర్షం వల్ల రైతులు వరి పంటకు నష్టం చేకూరుతందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. వరి చిరు పొట్టదశకు చేరుకునే తరుణంలో ఈ వర్షం వల్ల పంట దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉందని రైతులు చెప్పారు.



ఉల్లిపాలెంలో ఇంటిపై పడిన తాడిచెట్టు

### ఉల్లిపాలెంలో నివాస గృహంపై విరిగి పడిన తాడిచెట్టు

**కోడూరు** : బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా ఈదురుగాలులతో కురిసిన భారీ వర్షానికి తాడిచెట్టు విరిగి నివాస గృహంపై పడిన సంఘటన ఉల్లిపాలెం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన ఒడుగు పున్నారావు నివాస గృహం పక్కన ఉన్న తాడిచెట్టు సోమవారం ఒక్కసారిగా విరిగి ఇంటిపై పడింది. అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలదేఉ. . ఇంటిపై రేకులు పూర్తిగా ధ్వంసమయ్యాయి.

### నాగాయలంకలో కుండపోత

**నాగాయలంక, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి)**: అల్పపీడనం ప్రభావంగా సోమవారం ఉదయం నుంచి మండలంలో భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లలో వాన నీరు నిలిచి ప్రజలు రాకపోకలకు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. అల్పపీడనంతో సముద్రం అల్లకల్లోలంగా ఉండటంతో మత్స్యకారులు తమ పడవలను ఒడ్డుకు చేర్చి లంగర్లు వేశారు.

### రెండు బైక్‌లు ఢీ : ఇద్దరికి గాయాలు

**పెడన రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి)** : మడక పెట్రోల్ బంక్ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను 108 వాహనంలో బందరుప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితులు బందరు బలరామునిపేటకు చెందిన వారుగా గుర్తించారు. ప్రమాద సూచిక బోర్డులు లేకపోవటంతో నెలలో నాలుగు ప్రమాదాలు జరిగాయని స్థానికులు తెలిపారు. హైవే అధికారులు, పోలీసులు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

| బ్రాయిలర్ ధరలు | |
| --- | --- |
| అమరావతి | (రూ.లలో) |
| బ్రాయిలర్ బర్డ్ | 140, 149, 160 |
| చికెన్ విత్ స్కిన్ | 270 |
| చికెన్ స్కిన్‌లెస్ | 280 |
| నెక్ కోడిగుడ్ల ధర (100) | |
| విజయవాడ జోన్ రైతు ధర రూ.525 | |

### రూ.71 కోట్లతో అభివృద్ధి పనులు

- మంత్రి రవీంద్ర

**మచిలీపట్నం టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి)** : మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలో రూ.71 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఆర్ అండ్ బి అతిథి గృహంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించిన అనంతరం సోమవారం రాత్రి మీడియాతో మాట్లాడారు. ఆర్ అండ్ బి శాఖ కింద నియోజకవర్గంలో శిథిల రోడ్ల పనులు చేపడుతున్నామన్నారు. 15వ ఆర్థిక సంఘ నిధులతో వివిధ గ్రామాల్లో రోడ్లు, శ్మశానాలు, ప్రహరీ అభివృద్ధి పనులు చేపడతామన్నారు. వీటితో పాటు రూ. 20 కోట్లు మైనింగ్ గ్రాంటు తీసుకువచ్చామని, ఈ నిధులతో చేపట్టబోయే పనులకు ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. మోడల్ నియోజకవర్గంగా చేయడమే లక్ష్యంగా వివిధ శాఖలను సమన్వయం చేస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

**పల్లె పండుగపై సమీక్ష**

జిల్లాలో పల్లెపండుగకు కేటాయించిన నిధులు, అభివృద్ధి పనులపై సోమవారం రాత్రి రోడ్లు మంత్రి కొల్లు రవీంద్ర అధికారులతో సమీక్షించారు. ఆర్‌అండ్‌బి శాఖ, పంచాయితీరాజ్ శాఖ అధికారులతో ముందుగా సమీక్షించారు. పల్లెపండుగలో చేపట్టే అభివృద్ధి పనులపై చర్చించారు. పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు సమాయత్తం కావాలని మంత్రి సూచించారు. సీనియర్ టీడీపీ నాయకుడు గోపీచంద్ , మునిసిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, మాజీ ఎంపిపి కాగిత గోపాలరావు, మాజీ జడ్‌పిటిసి లంకే నారాయణప్రసాద్, టీడీపీ నాయకులు కుంచే నాని, గోపు సత్యనారాయణ, పిప్పళ్ళ కాంతారావు, లంకే శేషగిరి, అక్కుమహంతి రాజా పాల్గొన్నారు.



కానూరులో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న గోపు



లంకమ్మ మాన్యంలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మండలి



మాట్లంలో శంకుస్థాపన చేస్తున్న కాగిత

# పల్లెల అభివృద్ధి కూటమితోనే సాధ్యం

**మచిలీపట్నం టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి)** : పల్లెల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణరావు అన్నారు. పల్లెపండుగ సోమవారం కానూ రు, పెదపట్నం, శిరివెళ్ళపాలెం, గోకవరం, మంగినపూడి, తపసిపూడి గ్రామాల్లో ప్రారంభించి, వివిధ అభివృద్ధి పనులకు కూటమి నాయకులు శంకుస్థాపన చేశారు. రోడ్లు, డ్రెయిన్లు, ప్రహరీల పనులకు భూమి పూజ చేశారు. బందరు రూరల్ టీడీపీ అధ్యక్షుడు కుంచే నాని మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సారథ్యంలో గ్రామాల్లో ఆనందం వెల్లి విరుస్తోందన్నారు. ఎంపీడీవో సిహెచ్ వెంకటేష్, టీడీపీ నాయకులు మీనవల్లి నాగేశ్వరరావు, సిహెచ్ సత్యనారాయణ, సుబ్బారెడ్డి, వంక కాశీ, కాకర్ల కాంతారావు, సాంబయ్య, యుగంధర రెడ్డి పాల్గొన్నారు.

**నూరు శాతం సీసీ రోడ్ల నిర్మాణం**

**అవనిగడ్డ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి)** : గ్రామాల్లో నూరు శాతం సీసీ రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. అవ నిగడ్డ శివారు లంకమ్మ మాన్యంలో నూతన సీసీరోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ భూమి పూజ చేశారు. పల్లె పండుగలో నియోజకవర్గంలో రూ.30.68 కోట్లతో 48.730 కిలో మీటర్ల పొడవునా 496 సీసీ రోడ్లను నిర్మించనున్నట్లు తెలిపారు. జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మత్తి వెంకటేశ్వరరావు, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, కూటమి నాయకులు కొల్లూరి వెంకటేశ్వరరావు, గుడివాక శేషుబాబు, పంచాయతీరాజ్ డిఈఈ పగడాల సురేష్, ఉపాధి పథకం ఏపీవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

**అశ్వారావుపాలెంలో..**

**అవనిగడ్డ రూరల్** : అభివృద్ధిలో అశ్వారావుపాలెం అగ్రగామిగా నిలవాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. అశ్వారావుపాలెంలో పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాల సందర్భంగా రూ.23.60 లక్షలతో మూడు నూతన సీసీ రహదారుల నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. కూటమి నాయకులు మత్తి వెంకటేశ్వరరావు, కొల్లూరి వెంకటేశ్వరరావు, గుడివాక శేషుబాబు, ఎంపీటీసీ సభ్యుడు కటికల వసంత్, బొప్పన భాను, సర్పంచ్ పండ్రాజు లంకమ్మ ప్రసాద్, ఉపసర్పంచ్ యక్కటి నాగరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**కృత్తివెన్నులో ఎమ్మెల్యే కాగిత శంకుస్థాపన**

**కృత్తివెన్ను, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి)** : పల్లె పండుగలో భాగంగా మాట్లం, నిడమర్రు పంచాయతీలలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ శంకుస్థాపన చేశారు. మాట్లంలో రూ.31.90 లక్షలతో, నిడమర్రులో రూ.45 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జనసేనపార్టీ నియోజకవర్గ కన్వీనర్ పంచకర్ల సురేష్, మండల టీడీపీ అధ్యక్షుడు ఒడుగు తులసీరావు, ప్రధాన కార్యదర్శి పిన్నెంటి రత్తయ్య, మాట్లాం గ్రామ సర్పంచ్ తిరుమాని పాండురంగారావు, నిడమర్రు సర్పంచ్ బంగార్రాజు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సుధారాణిని అభినందిస్తున్న శాస్త్రవేత్తలు

### కేవీకే శాస్త్రవేత్త సుధారాణి బాధ్యతల స్వీకారం

**ఘంటసాల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి)** : ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్తగా డాక్టర్ డి.సుధారాణి సోమవారం బాధ్యతలు చేపట్టారు. డాక్టర్ సుధారాణి ఉయ్యూరు చెరకు పరిశోధనా స్థానంలో సీనియర్ శాస్త్రవేత్తగా పనిచేస్తూ బదిలీపై ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రానికి వచ్చారు. సమన్వయంతో రైతులకు పలు సూచనలు అందజేస్తానని ఆమె తెలిపారు. శాస్త్రవేత్తలు వి.మంజువాణి, బి.నవీన్, జి.కృష్ణవేణి, ఎం.వెంకటలక్ష్మి, సుబ్బారెడ్డి, సాయి అభినందనలు తెలిపారు.

### రైతు సేవా కేంద్రాల్లో ఈ-క్రాప్ నమోదు జాబితాలు

- 16 వరకు అభ్యంతరాలు స్వీకరణ

**ఘంటసాల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి)** : ఖరీఫ్ పంటకాలంలో 13 రైతు సేవా కేంద్రాల పరిధిలో 19,389 ఎకరాల్లో సాగు చేసిన పంటలు, రైతుల వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేసినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి కె.మురళీకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు సేవా కేంద్రం పరిధిలో సాగు చేసి పంటలు, రైతుల సమాచారం ముసాయిదా జాబితాలను ఆయా రైతు సేవా కేంద్రం నోటీసు బోర్డులో ప్రదర్శించటం జరిగిందన్నారు. అభ్యంతరాలు ఉంటే రైతులు ఈ నెల 16వ తేదీలోపు అర్జీలు అందజేస్తే పరిశీలించి చివరి సారిగా మార్పులు చేసి 18వ తేదీన తుది జాబితాలను ప్రదర్శిస్తామన్నారు. తుది జాబితా ఆధారంగా రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ జరుగుతుందని ఆయన వివరించారు.

**హిందూ కళాశాలలో సందడే సందడి**

**మచిలీపట్నం టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి)** : మద్యం దుకాణాల వేలంపాటలకు పెద్ద సంఖ్యలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వచ్చిన నాయకులు, వ్యాపారులతో హిందూ కళాశాల ప్రాంగణంలో సందడి నెలకొంది. లాటరీలో షాపు దక్కించుకున్న వారు సంతోషం వ్యక్తం చేయగా, షాపు దక్కని వారు నిరాశతో వెనుదిరిగారు. మహిళలు సైతం మద్యం వేలం పాటల్లో పాల్గొన్నారు.



సుభానీ పిల్లల విద్యాభ్యాసానికి సాయం అందిస్తున్న ఐవీఎం డైరెక్టర్ వేముపల్లి సురేష్..రోజా దంపతులు

### కిడ్నీ బాధితుడికి ఐవీఎం సురేష్ సహాయం

- పిల్లల విద్యాభ్యాసానికి రూ.20 వేలు
- కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు సాయం చేస్తానని హామీ

**చల్లపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి)** : చల్లపల్లికి చెందిన కిడ్నీ బాధితుడు అబ్దుల్ సుభానీకి ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ డైరెక్టర్ వేములపల్లి సురేష్ అండగా నిలిచారు. పురిటిగడ్డలోని ఐవీఎం కార్యాలయంలో సుభాని పిల్లలు నస్రీన్, సుహాన్ విద్యాభ్యాసం కోసం రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అందచేశారు. కిడ్నీ మార్పిడి ఆపరేషన్ సమయంలో తనవంతుగా ఆర్థిక సహాయం అందిస్తానని భరోసా ఇచ్చారు. ఐవీఎం ట్రస్ట్ డైరెక్టర్ వేములపల్లి రోజా, ప్రముఖ న్యాయవాది తుటారం ప్రసాద్, పట్నాల రాజా, మస్తాన్ పాల్గొన్నారు.



బంగారుపతకం సాధించిన ఏక్తాప్రియను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, కోచ్‌లు

### జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు చల్లపల్లి విద్యార్థిని ఏక్తాప్రియ


**చల్లపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి)** : స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో రామానగరం శ్రీచైతన్య స్కూల్ విద్యార్థిని గూడపాటి ఏక్తాప్రియ బంగారు పతకం సాధించింది. తిరుపతిలో మూడు రోజులపాటు జరిగిన పోటీల్లో ఆరో తరగతి విద్యార్థిని ఏక్తాప్రియ అండర్ - 14 (18 - 20 కిలోలు) విభాగంలో బంగారు పతకం సాధించి జాతీయ స్థాయికి ఎంపికైంది. విద్యార్థిని ఏక్తాప్రియను ప్రిన్సిపాల్ డి.సురేష్, సుబ్బు తైక్వాండో వారియర్స్ అకాడమీ కోచ్‌లు కె.సుబ్బు, ఎస్.జాహ్నవి అభినందించారు.



# సత్యమేవ జయతే

నేడు వెంపటి చిన్నసత్యం జయంతి

## కూచిపూడిని విశ్వవ్యాప్తం చేసిన వెంపటి చినసత్యం



- సినీ నృత్య దర్శకుడిగా ప్రాచుర్యం
- టీటీడీ ఆస్థాన నాట్యాచార్యుడిగా అంతులేని ఖ్యాతి
- పద్మభూషణ్ వంటి ఎన్నో అవార్డులు సొంతం
- మహామహులకు నాట్యంలో మెలకువలు నేర్పిన గురువు
- ప్రపంచవ్యాప్తంగా 10 వేలకు పైగా శిష్యులు
- ఏటా యక్షగాన సార్వభౌమ స్మారక పురస్కారం
- కూచిపూడి నుంచి కాలిఫోర్నియా వరకూ విజయదుందుభి

కూచిపూడి.. ఈ పేరు వినగానే ఎవరికైనా గుర్తొచ్చేది ఆంధ్రజాతికి ఆభరణమైన కూచిపూడి నృత్యమే. హావభావాలు, హస్త విన్యాసాలు, పదకృతులతో ఆవిష్కృతమయ్యే మనోజ్ఞ ప్రబంధమే. అంతటి కూచిపూడి నృత్యానికి మరిన్ని మెరుగులుదిద్ది విశ్వవ్యాప్తం చేసిన గొప్ప వ్యక్తి వెంపటి చినసత్యం. దక్షిణ భారతంలో భరతనాట్యమే ప్రధానంగా విరాజిల్లుతున్న తరుణంలో తన కళారూపాలు, నృత్య రూపకాలతో కూచిపూడికి ప్రాచుర్యం కల్పించారు. క్షీరసాగర మదనం మొదలు చండాలిక వంటి ఎన్నో నృత్య రూపకాలు రూపొందించి, ప్రపంచవ్యాప్తంగా కూచిపూడి నృత్య రూపకాలు ప్రదర్శించి తెలుగువాడి కీర్తి పతాకాన్ని విశ్వవీధుల్లో రెపరెపలాడించిన మహానుభావుడి జయంతి, ప్రపంచ కూచిపూడి దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

**(ఆంధ్రజ్యోతి, అవనిగడ్డ/కూచిపూడి):** కూచిపూడి గ్రామంలో 1929, అక్టోబరు 15న వెంపటి చలమయ్య-వరలక్ష్మి దంపతులకు చినసత్యం జన్మించారు. తాడేపల్లి పేరయ్య శాస్త్రి వద్ద అభ్యాసం ప్రారంభించి ఆరేళ్ల చిరుప్రాయంలోనే గురువు మన్ననలు పొందారు. వేదాంతం లక్ష్మీనారాయణ శాస్త్రి వద్ద కూచిపూడిలో అన్ని మెలకువలు నేర్చుకుని పసుమర్తి కొండలరాయుడు నాట్యమేళాలో వివిధ పాత్రల పోషణలో తర్ఫీదు పొందారు. అనంతరం ఆర్థిక ఇబ్బందులతో మద్రాసు వెళ్లి తన సోదరుడు వెంపటి సత్యం వద్ద కొన్నాళ్లు శిష్యరికం చేశారు. సినిమాల్లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా ప్రవేశించి నృత్య దర్శకుడిగా పలు చిత్రాల్లో పనిచేశారు. లవకుశ, శ్రీకృష్ణవిజయం వంటి ఎన్నో చిత్రాలకు నృత్య దర్శకత్వం వహించారు. 'లవకుశ' సినిమాలో 'వినుడు.. వినుడు రామాయణ గాథ' పాటకు నృత్యాన్ని సమకూర్చగా, 'శ్రీకృష్ణ విజయం' చిత్రంలో నటి హేమమాలిని నర్తించిన 'జోహారు శికిపించమౌళీ..' పాటకు నృత్య దర్శకత్వం వహించారు. సినిమాలద్వారా ఆర్థిక ఇబ్బందులు తొలగినా అది ఆయనలోని కళాతృష్ణను తీర్చలేకపోవటంతో 1963 ఫిబ్రవరి 6న కూచిపూడి ఆర్ట్స్ అకాడమీని ఏర్పాటు చేసి వేలాది మందికి కూచిపూడి నృత్యంలో శిక్షణ ఇచ్చి ప్రఖ్యాతి పొందిన నృత్య కళాకారులుగా తీర్చిదిద్దారు.

### విప్లవాత్మక మార్పులు

నాట్య రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు చినసత్యం. అప్పటి వరకు కేవలం పురుషులే నృత్య రూపకాల్లో ఉంటూ స్త్రీ పాత్రలు పోషించేవారు. కానీ, వెంపటి చినసత్యం తాను రూపొందించిన నృత్య రూపకాల్లో మహిళా పాత్రలను మహిళలతోనే వేయించి విప్లవాత్మకమైన మార్పుకు శ్రీకారం చుట్టారు.

### ఎన్నో అవార్డులు, పురస్కారాలు

కూచిపూడి నాట్యాచార్యులుగా, నృత్య రూపకాల శిల్పిగా 4 దశాబ్దాలపాటు విశేషంగా సేవలందించిన చినసత్యం ఎన్నో అవార్డులు, గౌరవ పురస్కారాలు అందుకున్నారు. 1980లో ఆంధ్ర విశ్వవిద్యాలయం కళాప్రపూర్ణ అవార్డుతో ఆయన్ను గౌరవించగా, 1981లో కేంద్ర సంగీత నాటక అకాడమీ కూచిపూడి నాట్య ప్రముఖ్ పురస్కారాన్ని అందించింది. 1983లో శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయగా, 1992లో మధ్యప్రదేశ్ ప్రభుత్వం కాళిదాసు పురస్కారాన్ని ప్రదానం చేసింది. 1994లో తమిళనాడు ప్రభుత్వం కళైమామణి అవార్డు అందించగా, భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకమైన పద్మభూషణ్ అవార్డుతో గౌరవించింది. 2001లో సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్ అందించింది. పలు జీవన సాఫల్య పురస్కారాలను ఆయనందుకున్నారు.

### ప్రపంచవ్యాప్తంగా శిష్య బృందం

వెంపటి చినసత్యానికి ప్రపంచవ్యాప్తంగా శిష్య బృందం ఉంది. ప్రఖ్యాత నృత్య కళాకారులు యామిని కృష్ణమూర్తి, రేఖ, మంజుభార్గవితో పాటు నిన్నటి తరం నటి రమ్యకృష్ణ సైతం చిన్నసత్యానికి శిష్యులే. మద్రాసులో ఏర్పాటు చేసిన కూచిపూడి ఆర్ట్స్ అకాడమీలో దాదాపు 10వేల మందికిపైగా నాట్యం నేర్చుకుని వివిధ ప్రాంతాల్లో ప్రదర్శనలిస్తున్నారు.

### కుటుంబ నేపథ్యం

1952లో స్వరాజ్యలక్ష్మిని వివాహమాడిన ఆయనకు కామేశ్వరి, కాత్యాయణి, బాలాత్రిపుర సుందరి, వెంకట చలపతి సంతానం. 2,800 మందితో హైదరాబాద్‌లో ప్రదర్శన ఇచ్చి ఔరా.. అనిపించారు. 1963లో చెన్నైలో కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేయగా, ఆయన వద్ద శిష్యరికం చేసిన శిష్యులు 2,800 మందితో 2011లో హైదరాబాద్‌లో ప్రదర్శన ఇచ్చారు. ఈ ప్రదర్శనకు గిన్నిస్ బుక్‌లో స్థానం లభించింది. 1963లో స్థాపించిన కూచిపూడి ఆర్ట్స్ అకాడమీకి తమిళనాడు ప్రభుత్వం 1997లో భూమిని కేటాయించగా, ఆయన శిష్య బృందం సహకారంతో సొంత భవనంలో నేడు అకాడమీ విజయవంతంగా నడుస్తోంది.

### రాష్ట్ర ప్రభుత్వ అరుదైన గౌరవం

2012, జూలై 29న వెంపటి చినసత్యం మృతి చెందగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆయనకు అరుదైన గౌరవాన్ని ఇచ్చింది. ఏటా అక్టోబరు 15న ప్రపంచ కూచిపూడి దినోత్సవంగా ప్రకటించి వేడుకలు నిర్వహించటంతో పాటు ఆయన పేరిట రూ.5లక్షలతో యక్షగాన సార్వభౌమ స్మారక పురస్కారాన్ని అందిస్తోంది.

### అందెల రవళిని విశ్వవ్యాప్తం చేసిన మహాతపస్వి

స్వాతంత్ర్యానికి పూర్వం కేవలం కూచిపూడికే పరిమితమైన కూచిపూడి నృత్యాన్ని విశ్వవ్యాప్తం చేయటంలో వెంపటి చినసత్యం రూపొందించిన నృత్యరూపకాలు విశేష పాత్రను పోషించాయి. 1947లో సినీరంగంలో ప్రవేశించిన ఆయన 1961లో సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో క్షీరసాగర మదనం నృత్య రూపకాన్ని రూపొందించి ప్రదర్శించారు. ఈ నృత్య రూపకం ఆయన జీవితాన్ని మలుపు తిప్పింది. అప్పటికే పేరెన్నికగన్న నృత్యకారిణిగా ఉన్న యామిని కృష్ణమూర్తి, వేదాంతం సత్యనారాయణ శర్మను కలుపుకొని రూపొందించిన ఈ క్షీరసాగర మదనం ఆయనకు మంచిపేరు తెచ్చింది. శ్రీకృష్ణసత్యల దాంపత్య శ్రుతుల వివరణ, నవరత్న నిర్మితమైన హంసతులికా తర్పాల విశేషాలను అభినయంతో ఆవిష్కరిస్తూ భామాకలాపాన్ని రూపొందించారు. ఈ నృత్య రూపకం ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు పొందగా, పలు అంతర్జాతీయ వేదికలపై ప్రదర్శితమైంది. అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానం ఆర్థిక సహకారంతో రూపొందించిన 'శ్రీనివాస కల్యాణం' నృత్య రూపకం తెలుగులోనూ, తమిళంలోనూ అజరామరంగా నిలిచింది. మేనక విశ్వామిత్ర, హరవిలాసం, అర్ధనారీశ్వరం, శివధనుర్భంగం, శాకుంతలం, విప్రనారాయణ, కుమార సంభవం వంటి పౌరాణిక సన్నివేశాలకు నృత్య రూపకాన్ని అందించిన చిన్నసత్యం ఠాగూర్ రచించిన 'చండాలిక' కావ్యాన్ని జనరంజకంగా తీర్చిదిద్దారు.

### నా పూర్వజన్మ సుకృతం



కూచిపూడి నాట్యానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చి ప్రపంచపటంలో సముచిత స్థానం కల్పించిన గొప్ప నాట్య గురువు వెంపటి చిన్నసత్యం. ఆయన దర్శకత్వంలో కాలిఫోర్నియాలో ప్రదర్శన ఇవ్వటం నా పూర్వజన్మ సుకృతం. కూచిపూడి ఆర్ట్స్ అకాడమీని చెన్నైలో స్థాపించి వేలాదిమంది శిష్యులను తీర్చిదిద్దిన గొప్ప నాట్యాచార్యులాయన. ఆయన వద్ద నేర్చిన కూచిపూడి నాట్య భంగిమలను భావితరాలకు అందించటం గొప్ప సదావకాశంగా భావిస్తున్నాను.

**- డాక్టర్ చింతా రవి బాలకృష్ణ, కూచిపూడి శ్రీసిద్ధేంద్ర కళాపీఠం వైస్ ప్రిన్సిపాల్**

---

పేకాట శిబిరంపై

## టాస్క్‌ఫోర్స్ దాడి

- 24మంది అరెస్ట్, రూ.1.52 లక్షలు స్వాధీనం
- నిర్వాహకుడు టీడీపీ 48వ డివిజన్ మాజీ అధ్యక్షుడు

**విద్యాధరపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):** భవానీపురంలో గుట్టు చప్పుడు కాకుండా టీడీపీకి చెందిన ఓ డివిజన్ మాజీ అధ్యక్షుడు జోరుగా పేకాట నిర్వహిస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు అతడిపై నిఘా పెట్టారు. ఈ క్రమంలో అతడు భవానీపురంలో ఓ గోడౌన్‌లో పేకాట ఆడుతుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. పశ్చిమలోని 48వ డివిజన్ టీడీపీ మాజీ అధ్యక్షుడు బేవర జోగేశ్వరరావు భవానీపురంలో ఉల్లిపాయల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. కొంతకాలం నుంచి కొందరు ఉల్లిపాయల వ్యాపారులతో ఉల్లిపాయల గోడౌన్‌లోనే గుట్టుచప్పుడు కాకుండా పేకాట నిర్వహిస్తున్నాడని టాస్క్‌ఫోర్స్ అధికారులకు తెలిసింది. సోమవారం ఈ టాస్క్‌ఫోర్స్ అధికారులు భవానీపురం పోలీసుల సహకారంతో పేకాట శిబిరంపై దాడిచేశారు. నిర్వాహకుడు జోగేశ్వరరావుతో పాటు మొత్తం 24 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి సుమారు రూ.1,52,700 స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. పోలీసులు వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. అయితే పేకాటలో మొత్తం రూ.5 లక్షలు పట్టుకున్నట్టు ప్రచారం జరుగుతోంది.

## 3న స్విమ్మింగ్ పోటీలు

**విజయవాడ స్పోర్ట్స్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):** నగరంలోని గాంధీనగర్ సర్ విజ్జీ వీఎంసీ స్విమ్మింగ్‌పూల్‌లో నవంబరు 3న సౌత్‌జోన్ ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల స్విమ్మింగ్ జిల్లా మీట్‌ను నిర్వహిస్తున్నట్టు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ సెక్రటరీ ఐ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పాల్గొనే క్రీడాకారులు తమ పేర్లను ఈనెల 29లోగా ఎస్ఎఫ్ఐ యూఐడీతో నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు జిల్లా సెక్రటరీ ఐ రమేష్ 79895 34719, కృష్ణాజిల్లా సెక్రటరీ వి వినోద్ 9160766070 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

## 16, 17న దుర్గగుడి హుండీల లెక్కింపు

**వన్‌టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):** దుర్గగుడిలో జరిగిన దసరా ఉత్సవాలను పురస్కరించుకుని భక్తులు సమర్పించిన కానుకలను ఈనెల 16, 17న లెక్కించనున్నట్టు దేవస్థానం ఈవో కేఎస్ రామారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహామండపం 6వ అంతస్తులో ఉదయం 8 గంటల నుంచి లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు.

## రూ.10 నాణేలపై అవగాహన

**విజయవాడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):** ఆర్బీఐ విడుదల చేసిన రూ.10 నాణేలపై వ్యాపారులకు అవగాహన కల్పించాలని యూనియన్ బ్యాంక్ అధికారులు నిర్ణయించారు. అన్ని బ్రాంచ్‌ల్లోను వ్యాపారులకు ఈ నాణేలు అందజేశారు. జిల్లాలోని అన్ని బ్రాంచ్‌ల్లో రిటైర్ కస్టమర్లు, పీఎం స్వానిధి రుణగ్రహీతలు, చిన్న వ్యాపారులు, కిరాణా వ్యాపారులకు సిబ్బంది రూ.10 నాణేలను అందజేశారు.

---



మద్యం మత్తులో వీరంగం చేసిన వ్యక్తి (టీ షర్ట్‌తో ఉన్న యువకుడు)

పంజా, నైజాంగేటు సెంటర్లలో

## గంజాయి, బ్లేడ్ బ్యాచ్ ఆగడాలు

- భయభ్రాంత్రులకు గురవుతున్న స్థానికులు

**ఆంధ్రజ్యోతి, వన్‌టౌన్:** వన్‌టౌన్‌లోని పంజాసెంటర్, నైజాంగేటు సెంటర్ల వద్ద రాత్రీ, పగలు అనే తేడా లేకుండా బ్లేడ్‌బ్యాచ్, గంజాయి బ్యాచ్ సభ్యులు వీరంగం వేస్తున్నారు. దీంతో స్థానికులు, ఒంటరిగా నడచుకుంటూ వెళ్లే మహిళలు భయభ్రాంతులకు గురవుతున్నారు. వీరిపై కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఈ బ్యాచ్ సభ్యులు పీకలవరకు మత్తు పదార్థాలు సేవించి రోడ్లపై గొడవపడుతూ తమ వద్ద ఉన్న బ్లేడులు, చాకులతో దాడులకు దిగుతున్నారు. అడ్డుకోవటానికి ప్రయత్నించిన స్థానికులను దూషిస్తున్నారు. మూడు రోజుల క్రితం వించిపేటలో టిఫిన్ బండి నడుపుకునే ఓ మహిళ వద్దకు పలువురు గ్యాంగ్ సభ్యులు వెళ్లి దాడికి ప్రయత్నించారు. ఆమె భయంతో కేకలేయగా, స్థానికులు పట్టుకోవటానికి ప్రయత్నించగా కొందరు పారిపోగా, ఒకరిని పట్టుకున్నారు. ఆ వ్యక్తిని స్థానికులు స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేశారు. ఇటీవల రైల్వే కో పైలట్‌పై ఓ సైకో దాడిచేసి హత్యచేసిన సంఘటన మరవకముందే బ్లేడ్, గంజాయి బ్యాచ్ సభ్యులు ఒంటరిగా ఉన్న మహిళలపై దాడులకు పాల్పడుతున్నారు. దీంతో స్థానికులు, ఒంటరిగా వెళ్లే మహిళలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ బ్యాచ్‌ల వారు ముఠాలుగా విడిపోయి అర్ధరాత్రి వేళలో రోడ్లపై వీరంగం వేస్తున్నారని, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి ఆయా ప్రాంతాల్లో రాత్రి వేళలో పోలీసు గస్తీ ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో

## ముగిసిన దసరా ఉత్సవాలు

- పాల్గొన్న సీపీ రాజశేఖర్ బాబు

**వన్‌టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):** దసరా పండుగ సందర్భంగా వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో సోమవారం జరిగిన పూర్ణాహుతి కార్యక్రమంతో దసరా మహోత్సవాలు ముగిశాయి. విజయవాడ నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై పూర్ణాహుతి, అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో దసరా మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం వన్‌టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో చండీహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ సిఐ గురుప్రకాష్ దంపతులు పాల్గొన్నారు. పూర్ణాహుతి కార్యక్రమంలో పోలీసు కమిషనర్ రాజశేఖర్ బాబు పాల్గొని అమ్మవారికి పట్టువస్త్రాలు, నవధాన్యాలు సమర్పించారు. అనంతరం సీపీ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ రాజశేఖర్ బాబు మీడియాతో మాట్లాడుతూ దసరా మహోత్సవాలకు సుమారు ఆరు వేల మంది పోలీసు సిబ్బంది విధుల్లో పాల్గొన్నారని తెలిపారు. దుర్గమ్మను 15 లక్షలకు పైగా భక్తులు దర్శించుకున్నారని, అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో దసరా ఉత్సవాలు ఘనంగా జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గగుడి ఈ.ఓ కె.ఎస్.రామరావు, డీసీపీ గౌతమీశాలిని, ఏడీసీపీ జి.రామకృష్ణ, వెస్ట్ ఏసీపీ దుర్గారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మహోత్సవాల ముగింపులో పాల్గొన్న సీపీ రాజశేఖర్ బాబు, ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులు.



మరుగుదొడ్ల నిర్వహణను పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

## పారిశుధ్యం, మౌలిక సదుపాయాలు భేష్

- భక్తుల మన్ననలు పొందుతున్న వీఎంసీ అధికారులు, సిబ్బంది

**ఆంధ్రజ్యోతి, చిట్టినగర్:** పారిశుధ్యం, మౌలిక సదుపాయాల కల్పనలో వీఎంసీ భేష్ అంటూ భక్తులతోపాటు నగర ప్రజల మన్ననలు పొందుతోంది. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే లక్షలాది మంది భక్తులకు పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా 3 షిఫ్టుల్లో సుమారు 1400 మంది సిబ్బందితో పనులు నిర్వహించారు. కొండచుట్టూ భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా తాత్కాలిక మరుగుదొడ్లతోపాటు మంచినీరు ఏర్పాటు చేశారు. క్యూలైన్లలో నిరంతరాయంగా మంచినీటి సరఫరాతోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నాయని భక్తులే చెబుతున్నారు. ముఖ్యంగా దుర్గాఘాట్, కృష్ణవేణి, పున్నమి, భవానీఘాట్‌లో పారిశుధ్య, మరుగుదొడ్ల, మంచినీటి, వాడకపు నీటి సమస్యలు లేకుండా అధికారులు పర్యవేక్షించారు. 24 గంటలు అధికారులను అప్రమత్తం చేస్తూ వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఎలాంటి సమస్యలు లేకుండా పర్యవేక్షించారు. కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా అధికారులను అప్రమత్తం చేస్తూ పరిసరాలను క్లీన్‌గా ఉంచారని కమిషనర్‌కు ప్రశంసలు వస్తున్నాయి. రోజుకు మూడు షిఫ్టుల్లో 120 వాహనాల్లో సుమారు 80 టన్నుల చెత్తను తరలించారు. చీఫ్ మెడికల్ ఆఫీసర్, ముగ్గురు అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్లతోపాటు వెటర్నరీ అసిస్టెంట్, బయాలజిస్ట్, 6 శానిటరీ సూపర్‌వైజర్లు, 64 మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, 74 మంది మేస్త్రీలు పని చేశారు. గతం కంటే ఈ దసరా ఉత్సవాల్లో వీఎంసీ ఏర్పాట్లు బాగున్నాయని భక్తులు మెచ్చుకుంటున్నారు.

---

# సీసీఐకి అమ్మకాలేవి..!

- ఆరు చోట్ల సీసీఐ కేంద్రాలు
- రూ.500 పెరిగిన మద్దతు ధర

**కంచికచర్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):** జిల్లాలో 2024-25 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఆరు యార్డుల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెలలోనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని సీసీఐ అధికారులు సూచించగా, పత్తి ఇంకా రానందున వచ్చే నెల మొదటి వారంలో కొనుగోళ్లు చేపట్టాలని మార్కెటింగ్ అధికారులు యోచిస్తున్నారు. మద్దతు ధరకు మించి ధర ఇవ్వని సీసీఐకి ఈ సీజన్‌లో కూడా పత్తి అమ్మేందుకు రైతులు ముందుకు వచ్చే పరిస్థితి కనిపించటం లేదు.

జిల్లాలో జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లో లక్ష ఎకరాల్లో పైగా రైతులు పత్తి సాగు చేశారు. ఆగస్టు చివర్లో, సెప్టెంబరు మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలకు, వరదలకు పత్తి చేలు బాగా దెబ్బతిన్నాయి. వ్యవసాయాధికారుల నివేదికల ప్రకారం జిల్లాలో 35 వేల ఎకరాల్లో పత్తి చేలు దెబ్బతిన్నాయి. ఈ ఏడాది పత్తి దిగుబడి గణనీయంగా తగ్గే సూచనలు కన్పిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో గిడసబారటం, ఇంకొన్ని ప్రాంతాల్లో చెట్లు పెరగకపోవటం వల్ల ఆశించిన దిగుబడులు రావని రైతులు చెపుతున్నారు. ఐదారు క్వింటాళ్లకు మించి దిగుబడి రావటం కష్టమని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం అక్కడక్కడ ముదురు చేలల్లో పత్తి తీతలు ప్రారంభమయ్యాయి. పొడి వాతావరణం నెలకొనటం వల్ల మొదటి తీత పత్తి నాణ్యతాపరంగా బాగానే ఉంది.

జిల్లాలో కంచికచర్ల, జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం వ్యవసాయ మార్కెట్ యార్డులతో పాటుగా తిరువూరు వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలోని గంపలగూడెం, ఎ. కొండూరులో సీసీఐ కేంద్రాలు ప్రారంభించాలని నిర్ణయించారు. గత మూడేళ్ల నుంచి జిల్లాలో సీసీఐ కొనుగోళ్లు పెద్దగా జరగటం లేదు. మద్దతు ధర కన్న బయటి మార్కెట్లో ధర ఎక్కువగా ఉండటంతో రైతులు సీసీఐకి పత్తి అమ్మలేదు. ఈ ఏడాది కూడా సీసీఐకి అమ్మే పరిస్థితి కనిపించటం లేదు. ప్రస్తుతం వరంగల్, నంద్యాల మార్కెట్లలో ప్రారంభంలో క్వింటా ఎనిమిది వేలకు పైగా ధర లభించగా, కొద్ది రోజుల నుంచి ఏడు వేలకు మించి రావటం లేదు. దిగుబడులు తగ్గినందున బయటి మార్కెట్లో ధర పెరుగుతుందన్న ఆశాభావంతో రైతులు ఉన్నారు.



పత్తి చేను (ఫైల్ ఫొటో)

ఈ సీజన్‌కు పొడవు పింజ పత్తి మద్దతు ధర క్వింటాకు కేవలం రూ. 501లు మాత్రమే పెరిగింది. గత సీజన్‌లో పత్తి మద్దతు ధర రూ. 7,020లు కాగా, కేంద్ర ప్రభుత్వం ఈ సీజన్‌లో రూ. 7,521లుగా నిర్ణయించింది. కొద్ది సంవత్సరాల నుంచి బయటి మార్కెట్ ధర కన్నా మద్దతు ధర తక్కువగా ఉంటున్నది. వాతావరణ పరిస్థితులు, పెట్టుబడి ఖర్చులు, చీడపీడలను పరిగణలోకి తీసుకోకుండ కేంద్రం నిర్ణయిస్తున్న మద్దతు ధర కంటితుడుపు చర్యగా ఉందని రైతులు పేర్కొంటున్నారు. మద్దతు ధర వల్ల తమకు నష్టం తప్పితే ఏలాంటి ప్రయోజనం కలగటం లేదని రైతులు వాపోతున్నారు.



నిమజ్జనానికి తరలివెళుతున్న అమ్మవారు

## ఘనంగా కనకదుర్గాదేవి నగరోత్సవం

**తిరువూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి):** శాంతి నగర్‌లోని అమ్మవారి ఆలయంలో ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఆలయంలో శాంతి హోమం నిర్వహించారు. అనంతరం, ఉదయం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి నగరోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ ఉత్సవాల నిర్వహణ సందర్భంలో భక్తులకు అవసరమైన ఏర్పాట్లు గావించారు.

**ఇబ్రహీంపట్నం:** కొండపల్లి బ్యాంక్ సెంటర్‌లో బొడ్డురాయ్ సెంటర్లో చెరుకుమల్లి సురేష్ మిత్ర బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానం కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య పా ల్గొని భక్తులకు భోజనం వడ్డించారు.

**పెనుగంచిప్రోలు:** తూర్పు బజార్ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి నిమజ్జనోత్సవం సోమవారం కన్నుల పండుగగా నిర్వహించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలతో అమ్మవారికి ఘనంగా వీడ్కోలు పలికారు. కనకదుర్గమ్మ అమ్మవారిని సోమవారం స్థానిక మునేటిలో నిమజ్జనోత్సవం చేశారు. పెద్ద సంఖ్యలో కళాకారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## గండి మరమ్మతులు పూర్తి



**జి.కొండూరు, అక్టోబరు 14 (ఆంధ్ర జ్యోతి) :** గడ్డమణుగు - మునగపాడు గ్రామాల మధ్య బైపాస్ రోడ్డులో పులివాగుపై ఉన్న వంతెనకు ఇటీవల వచ్చిన వరదలకు భారీ గండి పడింది. దీంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. రైతులు పొలాల్లోకి వెళ్లేందుకు పడుతున్న ఇబ్బందులను మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ దృష్టికి గడ్డమణుగు గ్రామ టీడీపీ సీనియర్‌నేత, ఎంపీటీసీ నూతక్కి అపర్ణ భర్త నూతక్కి రాజారావు (రాజ) తీసుకెళ్లారు. దీంతో వారి సాయంతో సోమవారం గండి మరమ్మతు పనులు పూర్తి చేయించారు. ఈ పనుల్ని గ్రామ సర్పంచ్ ప్రత్తిపాటి రవీంద్రకుమార్‌తో కలిసి దగ్గరుండి పర్యవేక్షించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో తక్షణం గండిని పూడ్చించి రెండు గ్రామాల మధ్య రాకపోకలతో పాటు రైతుల ఇబ్బందులను తొలగించడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే వంసతకు, రాజకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.